ప్రజాశక్తి

Vol. 6, no. 10

(Mar. 7, 1945)

బెజవాడ, 1945

Record no. 683

Prajāśakti

Vol. 6, no. 10

(Mar. 7, 1945)

Bejavāḍa, 1945

Record no. 683

Regd. No M. 4486 0-2-0

ప్రజాశక్తి

సంపుటి 6 బుధవారం 7-3-45 సంచిక 10

జాతీయకవికి ఆంధ్రుల అఖండ సన్మానం

ఫిబ్రవరి 26 వ తేదీ. గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళాశాల ఎంసెమ్లీ హాలునిండా జనం క్రిక్కిరిసి కూర్చుని ఉన్నారు. పండితులు, విద్యాధికులు, దేశభక్తులు, విద్యార్థులు, విద్యార్థినులు, పురప్రముఖులు సన్మానసభలో ఆసీనులయ్యారు.

80 ఏండ్ల వృద్ధమూర్తి దేశభక్త కొండా వెంకటప్పయ్యగారు సభాధ్యక్షత వహించారు. ప్రక్కనే చిలకమర్తి పండితుడు ఆసీనుడయ్యాడు.

"మా తెలుగు తల్లికిదె మల్లెపూదండ!" అనే గేయంతో సభ ప్రారంభమయింది. విద్యార్థినులు జాతీయగీతం పాడారు. వట్టికొండ విశాలాక్షిగారు పంతులుగారిని ప్రశంసిస్తూ ఒక గేయం చదివారు.

ఆంధ్రదేశం గర్వపడవలసిన వ్యక్తి

దేశభక్తుడు తన ప్రారంభోపన్యాసంలో ఇలా సెలవిచ్చారు: "లక్ష్మీనరసింహం పంతులుగారితో నాకు 1908 నుండి పరిచయం వుంది. మేమిద్దరం దాదాపు సమవయస్కులమే. వయసులో కొద్దిగా నాకన్న చిన్నవారైనా, వారు నాకు గురుతుల్యులు. వారి పరిచయ భాగ్యానికి నేను గర్వపడుతున్నాను. నేనేగాదు, యావదాంధ్రదేశం గర్వపడవలసిన వ్యక్తి ఈయన.

"వీరి పూర్వులు మన మండలంలోనివారే. కాటకంవల్ల మన జిల్లావిడచి వెళ్ళిపోయారు. వీరి పూర్వులుకూడా గొప్ప పండితులు. లక్ష్మీనరసింహంగారు చిన్నతనంలోనే కవిత్వశక్తిని ప్రదర్శించారు. వీరి నవలలు, నాటకాలు, ప్రహసనాలు, ఉపన్యాసాలు, సాహిత్యానికీ, సంఘానికి ఎంతో ఉపకూర్చాయి. రాజకీయోద్యమంలో వీరుస్వయంగా పాల్గొనకపోయినా, అనేక ఉపన్యాసాలిచ్చారు. ఎప్పుడూ సానుభూతిని చూపారు. "భరతఖండంబు చక్కని పాడియావు" అనే వీరిపద్యం దేశభక్తిని వెల్లడించుతుంది. పంతులుగారు సంఘసంస్కార ప్రియులు. ఎన్నడో రామమోహన, వివేకానంద పాఠశాలలను స్థాపించి హరిజనసేవ చేశారు.

" ఇట్టి మహానుభావుడు మన దేశంలో పుట్టడం మన భాగ్యం. ఇట్టివారిని సత్కరించే అవకాశం కల్గినందుకు నేను సుదినం "

తర్వాత, దేశిరాజు కృష్ణశర్మగారు సందేశాలను చదివారు. తుమ్మల సీతారామమూర్తిచౌదరిగారు పంపిన సందేశ పద్యాన్ని, విస్సా అప్పారావు, రాయసం వెంకటశివుడు, దిగవల్లి వెంకటశివరావు, "తెలంగాణా" పత్రికాధిపతులు పంపిన సందేశాలను చదివారు.

"తెలంగాణ" పత్రికాధిపతులు సందేశంతో పాటు రు. 25-0-0 లు కానుకగా పంపించారు.

తర్వాత గుంటూరు అభ్యుదయ రచయితల సంఘం తరపున దేశిరాజు కృష్ణశర్మగారు సన్మానపత్రం సమర్పించారు. ఇంకా శారదకుటీర సంఘం, చీరాల యువజన సాహితీసంఘం (గుంటూరు)వారు సన్మానపత్రాలు సమర్పించారు. పుష్పమాలతో మహాకవిని ముంచివేశారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు ఉపన్యసించుతూ ఇలా అన్నారు :

కృష్ణశాస్త్రిగారి ప్రశంస

"అభ్యుదయరచయితలు పంతులుగారికి సన్మానంఏర్పాటు చేయడం, ఆసన్మానానికి వివిధ కవులను ఆహ్వానించడం గొప్ప విషయం. మాకూ, పంతులుగారికీ, ఆప్తబంధుత్వం ఉంది. అందుచే ఈసన్మానసభలో మాట్లాడటానికి నాకు హక్కువుంది; పిఠాపురంనుండి ఇంతదూరం నన్ను పిలిపించడంలో ఔచిత్యమూ ఉంది.

"నేడు సాహిత్యసేవకులు అనేకసంస్థలలో, అనేక సంఘాలలో పనిచేస్తున్నారు. ఒకసంస్థకూ, మరోసంస్థకూ; ఒకసంఘానికీ మరో సంఘానికీ విభేదాలున్నాయని తలచడం, - నిజంగా విభేదాలున్నా లేకపోయినా - ఉన్నవని ఇతరులనుకోవడం - ఇదంతా నాకు బాగాలేదు. వీరేశలింగంగారు మొదలుకొని నేటి యువకవుల వరకు అందరం ఒకేకుటుంబం వారం ఒకే వాహినిలోని వారం. ఒకేజాతివారం. వీరేశలింగం, చిలకమర్తిలాంటి మహావ్యక్తులు పనిచేసియుండకపోతే. మేముండేవారంకాము. పూర్వపు తరంవారు మొదలుకొని నేటి యువకులవరకూ కలసియుండే ఏదైనా ఒకమహాసాహిత్యసంస్థను నిర్మించితే, నేనెంతో సంతోషించుతాను.

"ఎవరికిసన్మానాలుచెయ్యాలో,ఎరికిచేయకూడదో కొందరు విచక్షణాజ్ఞానం చూపించడంలేదు. పూర్వం "ఆంధ్రపత్రిక" ఉగాది సంచికలో మహావ్యక్తుల చిత్రాలతోపాటు సామాన్యుల చిత్రాలుకూడ పడుతుండేవి. వారి బొమ్మక్రింద "వీరు గొప్ప భూస్వాములు. మాతృ పితృభక్తిపరాయణులు" అంటూ వ్రాశేవారు. అలాగే కొన్నిసన్మానాలు కూడా జరుగుతుండేవి. కాని ఈసన్మానం అలాంటిదికాదు. ఎందువల్లనంటే, గతించిన రోజులే మంచివనే వాదినికాను నేను. వెనుకటి రోజులకన్న ప్రస్తుతపరిస్థితులు మంచివనీ, రానున్న రోజులు ఇంకా మంచివనీ, ఆశగలవాడను. రోజురోజుకూ మానవుడుగాని, జాతిగాని అభ్యుదయం చెందవలసిందేగాని. వెనుకకుపోవడానికి అవకాశంలేదు. ఈసత్యాన్ని గ్రహించిన పెద్దలు వీరేశలింగంగారు,లక్ష్మీనరసింహంగారు.


"వీరేశలింగంగారు ఒక మహోద్యమం. చిలకమర్తి ఒక మహావ్యక్తి. అలాగే గిడుగురామమూర్తిగారు ఒక మహోద్యమం. గురజాడ అప్పారావుగారు ఒక మహావ్యక్తి. ఈ మహావ్యక్తులను గౌరవించడంలో విలువవుంది.

"ఒక్కొకరు కొన్ని విషయాల్లో ముందుకు నడుస్తారు. కొన్ని విషయాలల్లో వెనుకంజవేస్తారు. మనిషి వెనక్కినడుస్తూ చేయి ముందుకుపెట్టితే లాభంలేదు. శరీరం అంతా ముందుకు పోవాలి. సమగ్రమైనదే అభ్యుదయం అవుతుంది. ఈఅభ్యుదయం వీరేశలింగంగారిలోనూ, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారిలోను కన్పించుతుంది. లక్ష్మీనరసింహంగారు రాజకీయాలలో నైతం జంకలేదు. కాలవాహినితో పాటు ఏర్పడుచున్న ప్రతిఉద్యమంలోను వీరు పాల్గొనిసానుభూతి చూపారు. సాహిత్యానికీ-సమాజానికీ గల సన్నిహిత సంబంధాన్ని గ్రహించి, తమ సాహిత్యాన్ని సృష్టించారు.

ఎప్పుడూ తరుణుడే

" గిడుగు రామమూర్తిగారు వీరేశలింగంగారితో 1910 లో మాటాడుతూ, వచ్చేది ప్రజాయుగం. వ్యావహారిక భాష యుగధర్మం. మీరన్నివిధాలా ముందుకు నడిచారు. ఇక వెనకంజ వేయవద్దు. పాతబంధనాలు పోవాలి. ప్రజలకు శాస్త్రజ్ఞానం అబ్బాలి. ప్రాచీన సంస్కృతి వారికందజేయాలి-అని కోరితే వీరేశలింగంగారు వ్యవహారిక భాషా ఉద్యమంపట్ల సుముఖులయ్యారు. చిలకమర్తి కూడా వ్యవహారికభాషను అంగీకరించక పోయినా, భాషను సులభమొనర్చి, ఆ ఆదర్శాన్నే చేరగలిగారు.

"ఈ మహాకవి ముసలివాడుకాడు. ఏ మహాకవీ ముసలివాడుకాడు. అతనికి వార్ధక్యం ఉండదు. ఎప్పుడూ తరుణుడే.



చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు

చిలకమర్తి జీవితంనుండి మనం నేర్చుకోవలసిన మహాసందేశం ఒకటివుంది.అది ఆశావాదం.ఆయనకెప్పుడూ నిరాశ జనించలేదు. 'మిల్టన్' ఒకానొకప్పుడు తన అంధత్వానికి వగచాడు. కాని ఈయన అలాకాదు. బాహ్యదృష్టి లేకపోయినా, అంతర్దృష్టి ఉన్నదా అనిపించుతుంది. వీరి కవిత్వంలోగాని, మాటలలోగాని ఆనందమే కన్పించుతుంది. వీరి హాస్యంలోని గొప్పతనానికికారణం వీరి నిష్కల్మష హృదయమేనని నాఅభిప్రాయం. బాహ్యప్రపంచంలోని ఆనందాలను వీరు చూడలేకయున్నా, సమస్త విషయాలను అర్థంచేసుకొని, తమకవిత్వంవల్ల బాహ్యప్రపంచాన్నంతటినీ ఈమహాకవి ఆనందింపజేస్తున్నాడు. ఇది సామాన్య మానవునికి సాధ్యమైన పనిగాదు. వీరిని గౌరవించడం ఎంతో ప్రశంసనీయమైన కార్యం."

సోమశేఖరశర్మగారి సందేశం

తర్వాత మల్లంపల్లి సోమశేఖరశర్మగారిలా ఉపన్యసించారు.

"చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి కృషివల్ల మనం చాలా విజ్ఞానవంతుల మయాం. దేశసేవను, సంఘసంస్కారాన్ని ఈయన రచనలు ప్రేరేపించినాయి. సులభశైలిలో వ్రాసి గ్రంధపఠనాశక్తి పెంపొందజేశారు. వీరి నాటకాలలోని పద్యాలు పశుల కాపరులు సైతం పాడారంటే, వీరి రచనలోని ప్రజారంజకతను అది తెలియజేస్తుంది. ప్రజలను విజ్ఞానవంతులను చేయడమే ఈయన ఉద్దేశ్యం. అభ్యుదయ రచయితలిలా సన్మానించడం చాలా మంచి కార్యం. పాత సంస్కృతి పునాదులపై కొత్త నిర్మాణాలను గావించుతూ, దేశానికీ భాషకూ అభ్యుదయరచయితలు సేవచేయాలి."

తర్వాత సన్మాన సంఘాధ్యక్షులైన దివాకర్ల లక్ష్మీనారాయణగారు, పంతులుగారితో తమకుగల పరిచయాన్ని వివరించుతూ, వెయ్యినూట పదహారు రూపాయలను లక్ష్మీనరసింహం గారికి సమర్పించారు. విమ్మట నూతన వస్త్రాలతో, చందన తాంబూలాలతో, పుష్పమాలలతో, ఫలప్రదానంతో కళాప్రపూర్ణుని సత్కరించారు ప్రేక్షకుల హర్షధ్వనులు మిన్నుముట్టాయి. ఇటికాల వెంకటరామశాస్త్రిగారు ఒక రజితపాత్రను పంతులుగారికి బహూకరించారు.

చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు తమ సన్మానానికి కృతజ్ఞత తెలియజేస్తూ, ఇలా అన్నారు:

"వాల్మీకిలాంటి కవులు పుట్టిన దేశంలో నాలాంటివాళ్లు కొద్దిమంది ఉండటం ఆశ్చర్యంకాదు. కవులను పూర్వం రాజులు పోషించేవారు, ఇప్పుడు రాజులు గర్వపోతులయారు. ప్రజలే ఇపుడు కవులను పోషించబూనుకోడం గొప్ప విషయం. కవులందరికర్తవ్యమూ సంఘానికి తోడ్పడటమే. మీయందరికీ నావిన్నపమొకటి వుంది. ఐకమత్యమనే పంచాక్షరీమంత్రం మరచిపోవద్దు. మనలో ఐకమత్యం లేకపోవడంవల్లనే ఈస్టిండియా కంపెనీ గెలవగల్గింది. ఈనాడు రష్యాలో ఐకమత్యంవల్లనే జయం పొందుతున్నారు. మనలో ఐకమత్యం వుంటే మనకు జయం తప్పదు."

తర్వాత కొండా వెంకటప్పయ్యగారు, సన్మానానికి కృషిచేసిన అభ్యుదయ రచయితలకూ, విరాళాలిచ్చిన ఉదారహృదయులకూ వందనాలర్పించారు.

దేశిరాజు కృష్ణశర్మగారి అభివందనాలతో సభముగిసింది. తర్వాత వేదాంతం జగన్నాథశర్మగారి బృందం(రాజమండ్రి) చక్కగా "భరతనాట్య" ప్రదర్శనం గావించారు.

★ సంపాదకీయం

తుంగభద్ర ప్రాజెక్టు

★

ఆంధ్రప్రజలు, కన్నడసోదరులు గత 50 సంవత్సరాలుగా చేసిన ఆందోళన ఫలించింది. ఫిబ్రవరి 28 వ తేదీన తుంగభద్ర ప్రాజెక్టు నిర్మాణానికి శంఖుస్థాపన జరిగింది. నదికి ఆవలిగట్టున బిరారు యువరాజుగారు హైదరాబాద్ సంస్థానం తరపున ప్రారంభోత్సవం జరిపారు. ఇటు మద్రాసు గవర్నరుగారు ప్రారంభోత్సవం జరిపారు. ఈవిషయమై మైసూరు, నైజామ్ ప్రభుత్వాలతో జయప్రదంగా రాయబారాలు జరిపి, దీక్షతో పనిచేసి, ప్రాజెక్టు నిర్మాణానికి అవకాశం కలుగజేసిన శ్రీ కొంతి రామమూర్తిగారికి యీసందర్భంలో అభినందనాలు తెల్పడం ప్రజ కర్తవ్యం.

ఈ స్కీమువల్ల మల్లాపురంవద్ద తుంగభద్రానదికి ఆనకట్ట వేయబడుతుంది. 138 చదరపుమైళ్లు వైశాల్యంకలిగినబ్రహ్మాండమైన జలాశయం(రిజర్వాయర్) నిర్మించబడుతుంది. దీనిలో 13,000 కోట్ల ఘన అడుగుల నీరు నిల్వచేస్తారు. ఈ నీటిని మద్రాస్, హైదరాబాద్ ప్రభుత్వాలు చెరిసమంగా వాడుకుంటాయి. ఈ జలాశయం ఎత్తు 150 అడుగులు. జలప్రవాహంనుంచి విద్యుచ్ఛక్తి తయారుచేయబడుతుంది. నిర్మాణమంతా పూర్తిగావడానికి 8 ఏండ్లు పడుతుంది. సుమారు 20 కోట్ల రూపాయిలు ఖర్చు అవుతుంది.

ఈ స్కీమువల్ల నిజాం సంస్థానంలో రాయచూర్ వగైరా జిల్లాలలో సుమారు 6 లక్షల ఎకరాల భూమి సాగు అవుతుంది. మనరాష్ట్రంలో బళ్లారి, కర్నూలు, అనంతపూర్ జిల్లాలలో మొత్తం 3 లక్షల ఎకరాలకు పైగా సాగు అవుతుంది. ఇందులో నూటికి 10 వంతులు మాత్రమే మాగాణిసాగు. తక్కిన భూములలో మెట్టపైరులకు మాత్రమే నీరు సప్లయి చేయబడుతుంది.

ఇపుడు అనావృష్టివల్ల యీ ప్రాంతంలో పంటలు సరిగా పండక, క్షామదేవతకు నిలయంగావుంది. ప్రాజెక్టు నిర్మాణంతో యీప్రాంతంలో పంటలు మూడురెట్లు అధికమవుతాయి. మేలురకం ప్రత్తి (లాంగ్ స్టేపిల్) పండుతుంది. పండ్లతోటలతోనూ, పంటచేలతోనూ పచ్చనై యీ ప్రాంతం కన్నులకు యింపు గొల్పుతుంది.

ఈ ప్రాజెక్టు నిర్మాణంతో రాయలసీమ ప్రజల అన్ని యిక్కట్లు తీరినవని చెప్పజాలము. ఇది కొంత ప్రాంతానికి మాత్రమే వినియోగిస్తుంది. రాయలసీమలోకి కరువు తొంగిచూడకుండా వుండాలంటే గండికోట, పెన్నారు, కుముద్వతి, సంగమేశ్వర వగైరా ప్రాజెక్టుల నిర్మాణానికికూడ ఆంధ్రులు ఆందోళన చేయవలసివుంది.

ఇంతేగాదు. తుంగభద్రా స్కీముక్రింద తయారయ్యే విద్యుత్తును వినియోగించుకొని రాయలసీమలో పరిశ్రమలు నిర్మించవలసివుంది. బట్టల మిల్లులు స్థాపించి పండే ప్రత్తిని నూలుగాను, బట్టలుగాను తయారు చేయాలి. అప్పుడు యిచట పండే ప్రత్తిని ఎగుమతి చేయాలసిన అవసరం, బట్టలు దిగుమతి చేసికోవాలసిన అవసరం వుండదు. రాయలసీమలో లోహ పరిశ్రమలు, రంగుల పరిశ్రమ నిర్మించడానికి అవకాశాలున్నాయి.

ఈ పనులన్నీ నెలకొల్పినప్పుడే ఆంధ్రభూమి ధనధాన్యాలతో తులతూగుతుంది. ఆంధ్రప్రజాభ్యుదయం దిన దినాభివృద్ధి చెందుతుంది. ఇందుకొరకు ఆంధ్రులందరూ ఐకమత్యంతో కృషిచేస్తారని ఆశించుతాము.

రైల్వేబడ్జటులో రు. 42 కోట్లు నిల్వ

కాని కార్మికుల నోట్లో కరక్కాయ

●

రైల్వేలైన్లు విరివిగా ఉన్నదేశాలలో భారత దేశంఒకటి. రష్యా, అమెరికాలు మినహా యితరదేశాలతో పోల్చిచూస్తే మన దేశంలోనే ఎక్కువగా రైల్వేలైన్లు ఉన్నాయి. బర్మా యుద్ధం ప్రారంభమైనప్పటినుంచీ మన రైల్వేట్రాన్స్‌పోర్టు మీద ఒత్తిడి అధికమైనమాట నిజమే. కాని, సోవియట్ రైల్వేలతో పోల్చిచూస్తే, యీ ఒత్తిడి సముద్రంలో నీటిబొట్టువంటిది. అయినప్పటికీ, మనదేశంలో యీరోజున రైల్వే ట్రాన్స్‌పోర్టు ఛిన్నాభిన్నం అయ్యే స్థితిలో ఉంది. 1943 లో బెంగాల్ ప్రజలకు ఆహారపదార్థాలందజేయడానికి వాగెన్లుచాలక, లక్షలాది జనం ప్రాణాలు విడిచారు. 1944 లో బట్టలమిల్లులకు కావలసిన బొగ్గును చేరవేయడానికి వాగెన్లు సరిపోలేదు. అందువల్ల బట్టలకరువు, దొంగమార్కెటు దేశంలో నలుమూలలా వ్యాపించాయి. ప్రయాణీకులకు పెట్టెలు తగినన్ని లేనందున, మూడవతరగతి ప్రయాణీకులు రైళ్ళలో యమయాతన అనుభవిస్తున్నారు.

రైల్వేట్రాన్స్‌పోర్టు ఇంత ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వసభ్యుడు, సర్ ఎడ్వర్డు బెంథాల్, కేంద్రశాసనసభలో కొత్తబడ్జటును ప్రవేశపెడుతూ, ఈయేడు 42 కోట్ల రూపాయలు నిల్వచూపాడు!

1944-45 సంవత్సరానికి రు. 217 కోట్లు ఆదాయం వస్తుందనీ, అందులో ఖర్చు రు. 147 కోట్లు ఉంటుందనీ, అతని అంచనా. ఈ రు. 147 కోట్లలో రు. 24 కోట్లు విదేశాలనుంచి దిగుమతి అయిన ఇంజన్లు వగైరా యంత్రసామగ్రికి ఇవ్వవలసిన విపరీతధరలకు, మిలిటరీ ఆవసరాలకు, ప్రత్యేకించబడ్డాయి.

ఈవిధంగా, రైల్వేలమీద నికరాదాయం రు. 70 కోట్లు చూపించాడు ప్రభుత్వ సభ్యుడు. ఈ రు. 70 కోట్లలో రు. 28 కోట్లు వడ్డీ తీర్చడానికి ఖర్చుపెడతారట. ఇక మిగిలిన రు. 42 కోట్ల నికరాదాయంలో రు. 32 కోట్లు ఇండియా ప్రభుత్వానికి దానంచేస్తారు; రు. 10 కోట్లు రైల్వే రిజర్వుఫండుతో కలిపి నిలవఉంచుతారు.

ఈ విధంగా, ప్రభుత్వ సభ్యుడు ఖర్చులన్నింటికీ ఆదాయం సమకూర్చుకుంటూ, ఇండియా ప్రభుత్వానికీ - రైల్వే రిజర్వుఫండుకీ కూడా కొంత మిగిల్చాడు.

కాని, కార్మికుల విషయం వచ్చేసరికి, వారి నోట్లో కరక్కాయ కొట్టాడు! వారి జీతభత్యాలకు ఒక్క దమ్మిడీకూడ బడ్జటులో ప్రత్యేకించలేదు.

1943 వ సంవత్సరపు మొదటి 8 నెలల్లో కంటె 1944 వ సంవత్సరపు మొదటి 8 నెలల్లోను వాగెన్లసంఖ్య 100 కి 7 చొప్పున హెచ్చిందనీ, 10 లక్షల టన్నుల బరువు గలిగిన సామాను అదనంగా రవానా చేయబడిందనీ, సర్ ఎడ్వర్డ్ బెంథాల్ ప్రకటిస్తున్నాడు. 1943 లో కంటె 1944 లో ప్రయాణీకులసంఖ్య 12 కోట్లు పెరిగిందని కూడా అంగీకరించాడు. ఇంత ఒత్తిడికి నిలబడి, ఎన్నో శ్రమదమాలకు ఓర్చి పనిచేస్తున్న కార్మికులవిషయం మాత్రం అతడేమీ పట్టించుకోలేదు. జీతాల హెచ్చింపుకోసం, అధికధరల అలవెన్సుకోసం, వేలకొద్దీ రైల్వే కార్మికులు క్రిందటి సంవత్సరం ఎన్నో సమ్మెలు చేశారనే విషయం అసెంబ్లీ సభ్యుల కతడు చెప్పకుండా మరుగుపరిచాడు. అలా చెబితే, తక్కువజీతాల కార్మికులు సహించరాని పరిస్థితుల నెదుర్కొలేక సమ్మెలు చేయవలసి వచ్చిందని ఒప్పుకోవాలి; వారి జీతభత్యాలకు కొంత సొమ్మునుబడ్జటులో ప్రత్యేకించవలసి వచ్చేది!

మన దేశంలో సగటున ఒక్కొక్క రైల్వే కార్మికునికి నెలకు రు. 23 కంటె ఎక్కువజీతం లేదు. కాని, కార్మికులలో అత్యధిక సంఖ్యాకుల జీతం నెలకు రు. 20 కంటె కూడా తక్కువే. వీరికి అధిక ధరల అలవెన్సు రు. 9 లు మొదలు రు. 16 వరకు మాత్రమే యిస్తున్నారు. కాని, కార్మికుని ఖర్చులో నాలుగైదు రెట్లు పెరిగాయి. కార్మికునికి యిప్పుడిచ్చే రు. 25, లేక రు. 30 జీతంతో తనూ, తన కుటుంబం పొట్టపోసుకోవడమే దుర్లభమవుతోంది. ఇక కట్టుకునే గుడ్డకూ, రోగంవచ్చినప్పుడు మందు ఖర్చులకూ, పిల్లల చదువుకూ, అప్పుచేయడం తప్ప మరోమార్గంలేదు. ఇంచుమించు ప్రతి కార్మికుడు (తక్కువ జీతాలవారు) పఠాన్ల దగ్గర విపరీతమైన వడ్డీకి అప్పులైనా తీసుకుంటున్నాడు; లేదా, నిత్యావసరాలకు డబ్బుచాలక బాధలైనా పడుతున్నాడు. ఈ దుర్భర పరిస్థితుల్లోకూడా కార్మికులు యావద్భారత దేశంలోను సమ్మెలుచేయకుండా ఓపికపట్టినందుకు వారిని బెంథాల్ అభినందించడంపోయి, తన ప్రయోజకత్వానికి చంకలుగుద్దుకుంటున్నాడు. కొద్దిజీతాలవారికి ఖర్చులెన్నో ఉండవు గనుక వారికి ధరలు పెరుగుతూన్నపుడల్లా అధిక ధరల అలవెన్సు కొద్దో, గొప్పో యిస్తున్నామని డంబాలు పలుకుతూన్నాడు. ఎక్కువ జీతాలవారికి, అనగా నెలకు రు. 700 మొదలు రు. 1000 వరకు జీతం వచ్చేవారికి, ఇంతవరకూ అధికధరల అలవెన్సే యివ్వలేదని కన్నీరుకార్చాడు! అందుకనే వీరికి నెలకు రు. 35 మొదలు రు. 100 వరకు జీతాలు హెచ్చించి, రు. 40 కంటె తక్కువజీతం వచ్చే సామాన్య కార్మికులకు ఒక్కదమ్మిడీకూడా హెచ్చించడానికివీల్లేదనినిశ్చయించాడు.

కార్మికుల కోర్కెలు

ఈ రోజున రైల్వేకార్మికులు కోరేదేమిటి? ప్రతివానికి నెలకు రు. 45 లు చొప్పున అధికధరల అలవెన్సు కావాలంటున్నారు. ప్రభుత్వం నియమించిన రావుకమిటీ సభ్యులే యిందుకంగీకరించారు. అదీకాక, యీ స్కేలు ననుసరించి అందరికీ ఆధికధరల అలవెన్సు యిస్తే బడ్జటులో నష్టం ఎంతమాత్రం రాదు.

ఎలాగో చూదాం. మొత్తం తక్కువ జీతగాళ్ళ సంఖ్య 6 లక్షలు. వీరందరికీ రు. 45 లు చొప్పున అదనంగా అలవెన్సుయిస్తే, రు 20 కోట్లు మొదలు రు. 25 కోట్ల వరకూ ఖర్చవుతుంది. ప్రస్తుతం ప్రతి కార్మికునికి చవుకదిణాల ద్వారా సగటున రు. 8 చొప్పున సహాయం లభిస్తోంది. ఈ సహాయానికి బదులు నగదురూపంలోనే రు. 45 చొప్పున యిస్తే, మొత్తం రు. 15 కోట్లు లేక రు 18 కోట్ల రూపాయలకంటే అవసరం ఉండదు. ఈ మొత్తాన్ని సేకరించడమెలాగంటే, రైల్వేరిజర్వుఫండుకుయివ్వదలచినరు. 10కోట్లూ కార్మికుల కీయవచ్చు. మరో రు. 8 కోట్లు యెలా వస్తుందంటే, ప్రభుత్వం రు. 24 కోట్లు యింజన్లువగైరా యంత్ర సామగ్రిని విపరీతధరలిచ్చి కొన్నందుకు, యుద్ధావసరాలకు కొత్తగా నిర్మించిన రైల్వేలకు, ప్రత్యేకించ దలచుకొంది. ఇందులో రు. 8 కోట్లు తగ్గించి కార్మికుల కీయవచ్చు.

యుద్ధానికి ముందు కార్మికులు ఎక్కువ జీతాలు కోరినప్పుడల్లా ప్రభుత్వం లాభాలు రావడంలేదని సాకుచెబుతూ వచ్చింది. ఇప్పుడు కావలసినంత లాభం రైల్వేలమీద వస్తూంటే, యుద్ధంవల్ల యేర్పడిన అసాధారణ పరిస్థితుల్లో ఎక్కువ జీతాలియ్యడం సాధ్యంకాదని వాదిస్తోంది; యుద్ధం అయిపోయినతరవాతే ఆలోచిస్తామని వాయిదా వేస్తోంది.

ఈవిధంగా, ప్రభుత్వం ప్రజల కొనుగోలుశక్తిమీద దెబ్బకొట్టి నోట్లసమ్మర్దాన్ని తగ్గించదలచుకొంది. పెట్టుబడిదార్ల లాభాలను ఎక్కువచేయడం, కార్మికుల పొట్టగొట్టడం — ఇదీ ప్రభుత్వపాలసీ. రాజకీయప్రతిష్టంభనను తొలగించడం యిష్టంలేదు; యుద్ధకారణంగా దేశంలో బయల్దేరిన విషమసమస్యలను ప్రజాసహకారంతో పరిష్కరించడం కంటకంగావుంది; ప్రజాప్రతినిధులతో గూడిన జాతీయ ప్రభుత్వం విషతుల్యం! — ఇదీ ప్రభుత్వవిధానం యొక్క సిగ్గు. బ్రిటిష్ గుత్తవ్యాపారస్తుల ప్రతినిధి సర్ ఎడ్వర్డ్ బెంథాల్, మనదేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధిచేయడం అతనికిష్టంగాదు. దేశంయొక్క అవసరాలకు తగినన్ని రైల్వేయింజన్లను ఇండియాలోనే తయారుచేయడానికి అవకాశం ఉన్నా, బెంథాల్ అందుకంగీకరిస్తాడా? ఇంగ్లండ్ నుంచే ఎక్కువధరలకు దిగుమతిచేస్తాడు! కార్మికులకు న్యాయమైన జీతాలిచ్చి, వారి సహకారం తీసుకుంటాడా?

ఈ ప్రభుత్వవిధానాన్ని (మిగతా 11 వ పేజీలో)

★ రాష్ట్ర రైతుమహాసభ

మహాసభ దిగ్విజయానికి ★

రైతాంగం కనబరుస్తున్న ఉత్సాహం

రాష్ట్ర రైతుమహాసభ ప్రచారరథం కదిలింది. రైతుసేవకులు 500 మంది 100 దళాలుగా ఏర్పడి జిల్లాలో మూలమూలలా మహాసభాశంఖం పూరించుతున్నారు. గ్రామగ్రామానా ఏగోడ చూచినా 'మహాసభ'తో ప్రత్యక్షం. దేశాభ్యుదయానికి జీవగర్ర రైతులోకం! రైతు మహాసభను దిగ్విజయం చేసే బాధ్యత అందరికీఉన్నది. కనుకనే గుంటూరులోనూ, చిలకలూరుపేటలోనూ సినిమాహాలు యజమానులంతా మహాసభా స్లయిడ్సు ఉచితంగా ప్రదర్శించుతున్నారు. మహిళలంతా ముగ్గులతో మహాసభ పిలుపు నందజేస్తున్నారు. గోవాడ, చుండూరు, కోటప్పకొండ శివరాత్రుత్సవాల్లో మహాసభ ప్రచారమే ప్రతిధ్వనించింది. మహాసభపేరు వినీ వినడంతోనే ప్రాణాలు లేచివస్తున్నయ్ రైతాంగానికి. "ఏమిపాపం చేశామో. నిరుడు బెజవాడ రైతుమహాసభకు రాలేకపోయాం. అటువంటి సభను దగ్గరలో మళ్ళీ చూడగలగడం అదృష్టం." అంటూ ఆహ్వానించారు అనేక రైతుపెద్దలు. ఎరువులు, ఇనుము, నీరు, బియ్యం సప్లయి చేయడంలో తమ కెక్కడికక్కడ తోడుపడ్డ రైతుసంఘబలాన్ని మహావైభవంగా చూడాలని రైతులంతా ఉవ్విళ్ళూరుతున్నారు. సామాన్యరైతాంగమూ, తదితర శ్రేయోభిలాషులూ ప్రారంభంలోనే చూపిన ఈ దిగువ ఆదరణే యిందుకు ప్రత్యక్షనిదర్శనం.

అవలవారిపాలెం రైతులుఒకబండిచిలగడదుంపలు, రెల్లుగడ్డి పాటపాడి సంపాదించిన మొత్తం రు. 82/- లు మహాసభకు ఇచ్చారు. ముసలమ్మ తన కోడితోనే తెల్లవారిందనుకొన్నట్లు, దుగ్గిరాలలో కొందరు రైతుసంఘ వ్యతిరేకులు తమకిష్టంలేకపోతే మహాసభ జరగదని భ్రమపడ్డారు: వీరి అసలుబండారం ఆ గ్రామరైతాంగానికి తెలుసు. మహాసభ దుగ్గిరాలలో జరిగినా, తెనాలిలో జరిగినా, తమయింట పెళ్లేనని వారికి తెలుసు. కనుకనే రెండువేల తాటాకు కొట్టి సిద్ధంచేస్తున్నారు. సభకు కావలసిన ఉప్పంతా తానే యిస్తానన్నాడు ఒక రైతుసోదరుడు. ఒకబండి కర్రపేళ్ళు తీసుకోమన్నాడు, మరొకాయన. గుమ్మడికాయలు వసూలుచేస్తున్నారు మరికొందరు. అయిదువందల అరటికాయ తను విరాళమన్నాడు, జాగర్లమూడివారు.

మహిళాలోకం ముందుగానే మేల్కొన్నది. రైతాంగంలో ఒకభాగమేకదా తాము! రైతుశ్రేయస్సే తమ విముక్తికి మార్గం! అందుకే బెజవాడలో జరిగిన అఖిలభారత రైతుమహాసభను దిగ్విజయం చేయుటలో తోడ్పడ్డారు. తెనాలి మహాసభకు మాత్రం ఊరుకుంటారా? మూదల, దొండపాడు, వెల్లటూరు, కఠెవరం, దుగ్గిరాలల్లో పచ్చళ్ళపట్టి సిద్ధంచేస్తున్నారు. వ్యవసాయకూలీసంఘ అధ్యక్ష, కార్యదర్శులు అప్పుడే రు 300/- లు మహాసభనిధి వసూలు చేశారు. కార్మిక-కర్షక కలయికే దేశాభ్యుదయం అంటూ మంగళగిరి మేకులఫ్యాక్టరీ కార్మికులు మహాసభకు కావలసిన మేకుల సప్లయిఅంతా మావంతన్నారు. ఉన్నది కొద్దికాలమైనా మహాసభను గొప్పగా జరపాలని ఎక్కడికక్కడ ముందుకొచ్చి రైతులు, రైతుశ్రేయోభిలాషులుదిగువవిధంగా మహాసభకు విరివిగా విరాళాలిచ్చారు.

శ్రీ సుంకర తిరుమలరావుపల్లెకోన		రు. 300
,, డా. కె కృష్ణమూర్తి	(రేపల్లె)	250
,, మైనేని రామయ్య	,,	250
,, ఏకా ఆంజనేయులు	(గుంటూరు)	116
,, కొమ్మినేని వెంకటేశ్వరరావు	,,	116
,, కాసరనేని వెంకటేశ్వర్లు	(క్రాప) రు	116
,, ఎ ఎస్. కృష్ణా	(గుంటూరు)	50
,, కర్రా సుబ్బయ్య	(క్రాప)	50
,, అంచా రంగారావు	(కొలకలూరు)	25
,, యన్. ఇగ్రా	(గుంటూరు)	25
,, గౌరీశంకర్	,,	25
,, ఆర్. రామదాసు,	,,	25
,, దేశిరాజు హనుమంతరావు	(గుంటూరు)	10
ఈమనిగ్రామం		250
యడ్లపల్లి		148
కంచెర్లపాలెం		225
శేకూరు		55
జాగర్లమూడి		23
గోవాడ తిరణాలలో		17
వెంగళాయపాలెం		78½

రైతు సోదరులా! ప్రజాఉద్యమాభిమానులారా! మార్చి, 28, 29, తేదీలలో తెనాలిలో జరిగే మహాసభను జయప్రదం చేయడం రైతుఉద్యమానికి, స్వాతంత్ర్యోద్యమానికి బలం. ఈమహాసభను దిగ్విజయం చేయ మీరంతా పూర్తిగా సాయపడాలి. ధన వస్తు రూపంలో విరివిగా విరాళాలివ్వాలి. వేలకు వేలుగా వచ్చి రైతుమహాసభ పిలుపందుకోవాలి.

యం. హనుమంతరావు,
ప్రచారక ఉపసంఘం,
8 వ ఆం॥ రా॥ రైతుమహాసభ
ఆహ్వానసంఘం, తెనాలి

★

గుంటూరుజిల్లా రైతు సోదరులకు విజ్ఞప్తి

★

రైతుసోదరులారా!

8వ ఆంధ్రరాష్ట్ర రైతుమహాసభ యీసంవత్సరం మార్చి 28, 29, తేదీలలో మన జిల్లాలో తెనాలిలో బ్రహ్మాండంగా జరగబోతూఉంది. 50 వేలకు తక్కువలేకుండా రైతాంగం మహాసభకు వస్తారు.

ఇంత బ్రహ్మాండంగా జరిగే రైతుమహాసభ జయప్రదంగావటం మనజిల్లా రైతుసోదరసోదరీమణులు చేసే ధన, ధాన్య, వస్తు సహాయాలమీద ఆధారపడియుంది. ముఖ్యముగా రైతుసోదరీమణులు మహాసభలోజరిగే భోజన వసతులకు అవసరమైన పచ్చళ్ళు, కారం, కూరగాయలూ, మజ్జిగ, విస్తళ్ళు, వగైరాలు సప్లయి చేయవలెను. ఇప్పటికే సత్తెనపల్లి, నర్సరావుపేట, గుంటూరు, తెనాలి తాలూకాలలో కొన్ని గ్రామాలలో పచ్చళ్లు పడుతున్నారు. విస్తళ్లు కుడుతున్నారు. కూరగాయలు నాటాలువేస్తున్నారు. జిల్లాలోనిఅన్ని గ్రామాలనుండి పచ్చళ్ళు వగైరాలుపటి, పంపించుటకు సోదరీమణులంతా పూనుకోగోరుచున్నాను.

రాష్ట్ర రైతుసోదరులకు విజ్ఞప్తి:

రైతుమహాసభకు వచ్చే వారంతా గత సంవత్సరం అ. భా. రైతు మహాసభకు వచ్చినట్లుగా కాలినడకను, రెండెడ్లబండి మీద రావాలి. ప్రతివారు నామట్టుకు నేనేగదా అని, రైళ్ళమీద, బస్సులమీదఆశపెట్టుకొనిఇప్పటికే యమయాతనలు పడుతున్న మామూలు ప్రయాణీకులకు ఇబ్బంది కలిగించవద్దు. అందరూ కాలినడకను, బండ్లమీదనురావాలి. బండ్లమీదవచ్చే వారంతా గతసంవత్సరం అ. భా. రైతుమహాసభకు వచ్చినట్లు తమ భోజనసదుపాయాలకు అవసరమైన సాధన సామగ్రిని తెచ్చుకొని ఆహ్వాన సంఘం వారికి కొంతవత్తిడితగ్గించుటకు సహాయపడప్రార్థన.

ఇట్లు,
రావి అమ్మయ్య,
ఆహ్వాన సంఘాధ్యక్షుడు

నిజాం ఆంధ్రమహాసభ కార్యకర్తలపై దుండగాలు

●

నల్లగొండజిల్లా, జనగాం తాలూకాలో విసునూరు రామచంద్రారెడ్డి లోకప్రసిద్ధి గాంచిన దేశముఖు. నాలుగు సంవత్సరాల క్రితం ఈయన రైతులవద్ద బలవంతంగా, సుమారు లక్షరూపాయలు వసూలుచేసి, విసునూరు గ్రామంలో సొంతభవన మొకటి నిర్మించాడు. దీనికి పనివాండ్లచేత వెట్టిచేయించుకున్నాడు. 15 సంవత్సరములక్రితం పండ్యాల వెంకటరెడ్డి అనే అనే మరొక దేశముఖు కూనీచేయబడినప్పుడు, ఈయన పాండిచేరి (ఫ్రెంచి ఇండియా) లో 2 సంతవత్సరాలు తల దాచుకొని, కేసు కొట్టివేయబడిన తర్వాత యిల్లు చేరుకున్నాడు! 3 సంవత్సరాలక్రితం 'బందగీ సాబు' అనే మహమ్మదీయ రైతును చంపించినది ఈయనేనని జిల్లాలో పుకారు బయల్దేరింది. ఈయన భూములలో పండే వందలపుట్ల ధాన్యాన్నీ పుగాకు, మిరపవడుగు మొదలైనవాటి నన్నిటినీ, గ్రామాలలో నివసించు రైతుల యిండ్లలోపోసి, రెండింతలు - మూడింతలూ ధరవసూలుచేస్తాడు. ఈయన వ్యవసాయపు పనులు పూర్తి అయేవరకు కూలీలు యితరుల పొలాలలో పనిచేయకూడదు. గర్భవతులు, ముదుసలి స్త్రీలు, చంటిపిల్లల తల్లులు, వ్యాధిగ్రస్తులు - అనే విచక్షణ లేకుండా అందరినీ బలవంతంగా యీడ్చుకువెళ్ళి, పొలాలలో పనిచేయించడం పరిపాటయింది. గతసంవత్సరం తహసిల్దారు కతార్ రామచంద్రరావు అనే మరొక దేశముఖుకు సేల్సు సొసయిటీలకుడబ్బు వసూలుజేసే అధికారం యిచ్చాడు. ఈ పెత్తనదారు 15 గ్రామాలలో 1½ లక్షల రూపాయలు పోగుచేయవలెనని ప్లానువేసి, ఒక్కొక్క గ్రామం నుండి జబర్దస్తీగా సొమ్మువసూలు చేశాడు. స్వగ్రామంలో 12 వేల రూపాయలు వసూలుచేసి, ఆ సొమ్ముతో ధాన్యం ఖరీదుచేసి, ఆ ధాన్యాన్ని - తన పొలంలో పండిన వంద పుట్ల ధాన్యాన్ని ఒక గోదాములో దాచిపెట్టాడు. రూల్సు ప్రకారం ఈ స్టాకును ప్రజలకు అందజేయలేదు.

ప్రజా చైతన్యం

ఈ దురంతాలనుండి ప్రజల్ని కాపాడేటందుకు, గత అయిదారు నెలలనుంచీ, జిల్లా ఆంధ్రమహాసభ కార్యకర్తలు ఆయా గ్రామాలలో సంచార మొనర్చారు. 30 గ్రామాలలో గ్రామ కమిటీలను స్థాపించారు. 8000 సభ్యత్వం చేర్పించారు. వీరు చేసిన ఆందోళన ఫలితంగా, ప్రజల్లో ధైర్యము, చైతన్యం కలిగాయి. దేశముఖుల దుండగాలు ఒక్కపెట్టున మాయమయాయి. ప్రజలకు ఆంధ్ర మహాసభ యెడల యెక్కడలేని భక్తి బయల్దేరింది. జిల్లాయందలి దేశముఖులు, వతందార్లు యీ ప్రజాచైతన్యంచూచి, జిల్లా వతన్ దార్ల సంఘమొకటి స్థాపించుకున్నారు. దానికి 2లక్షలరూపాయల నిధిని వసూలుచేస్తున్నారు.

కాని, ప్రజాందోళన ఎప్పటికీ పరాజయం పొందదు. ఆంధ్రమహాసభ కార్యకర్తలు నిజాం ప్రభుత్వానికీ, పత్రికలద్వారా ప్రజలకూ, తెలియ పరచిన అక్రమాలను ప్రభుత్వం విచారణ చేసింది. దాదాపు ఒక నెల క్రిందట విసునూరు రామచంద్రారెడ్డిని అధికారులు హైదరాబాదులో అరెస్టుచేశారు. ప్రభుత్వం ఆతనిపైకేసు పెట్టబోతుందనీ, జామీనుమీద విడుదల చేయబడ్డాడనీ, రూఢిగా తెలుస్తోంది.

దీనితో దేశముఖుల తిరుగుదాడి ప్రారంభమైంది. 12-2-45 వ తేదీని విసునూరుకు 4 మైళ్ళదూరంలో ఉన్న పాలకుర్తిగ్రామంలో శ్రీ ఆరుట్ల రామచంద్రారెడ్డి (జిల్లా ఆంధ్ర మహాసభ కార్యదర్శి) గారి అధ్యక్షతక్రింద పఠనాలయ ప్రారంభోత్సవం జరుపుటకు యేర్పాట్లుజరిగాయి. ఆ సభను విచ్ఛిన్నం చేయుటకు విసునూరునుండి 30 మంది రౌడీలు కత్తులు, కఠారులు, తుపాకులతో వచ్చారు. సభజరిగితే కార్యకర్తలనందరినీ తన్ని, రామచంద్రారెడ్డిగారిని హత్యచేస్తామని వారు బహిరంగంగాప్రకటించారు. పోలీసులుఅప్పుడు ఆగ్రామంలోనే ఉన్నారు. దుండగీంద్ర చర్యలనుగూర్చి కార్యకర్తలు పోలీసు అధికారికి వ్రాతపూర్వకంగా తెలియజేశారు. వీరంతా విసునూరు దేశముఖుచే పంపబడ్డారనీ, సభ జయప్రదంగా జరుగుటకు తగుచర్య తీసుకోవలసిందనీ, అందులో కోరారు. కాని, పోలీసు అధికారి తనవద్ద తగినంత సిబ్బందిలేదని జవాబుచెప్పాడు. "శాంతి భద్రతలకు" భంగం వాటిల్లకుండా సభను ఆపుజేయవలసిందని వ్రాతపూర్వకంగా ఉత్తరువుచేశాడు!

గూండాల అఘాయిత్యం

ఈ అసాధారణ పరిస్థితుల్లో ఆంధ్ర మహాసభ కార్యకర్తలు (మిగతా 4వ పేజీలో)

పోలెండు సమస్య

●

[మొన్న క్రైమియాలో జరిగిన త్రైరాజ్య సమావేశంలో యితరసమస్యలతోబాటు పోలెండ్ సమస్య కూడా పరిష్కరించబడింది. కర్జన్ సరిహద్దుకు తూర్పునఉన్న భాగం న్యాయంగాసోవియటు యూనియన్‌కిచెందాలనీ, మిగతాపోలెండు ప్రజాస్వామ్య సూత్రాల ప్రకారం, ప్రజాప్రతినిధులచే పరిపాలింప బడుతుందనీ, సంయుక్త ప్రకటన చేయబడింది. అయినా, సోవియట్ వ్యతిరేక పత్రికాసంపాదకులు, వ్యక్తులు పెద్ద గాలిదుమారం లేవదీశారు. సోవియట్‌యూనియన్ ఇతర సామ్రాజ్యవాదుల పద్ధతినే అనుసరించి, పోలెండును పంచుకొన నిశ్చయించిందని విషప్రచారం మొదలుపెట్టారు. ఈసమస్యను గురించి "అమృతబజార్ పత్రిక" (కలకత్తా) ఫిబ్రవరి 12 వ తేదీని క్రింది సంపాదకీయంరాసింది. క్రైమియా సమావేశానికి ముందు రాయబడిన వ్యాసం ఇది.అయినప్పటికీ, పోలిష్ సమస్యను నిష్పక్షపాతంగా పరిశీలించదలచుకున్న వారందరికి యిది ఉపయోగకారి.]

●

జర్మనీని పూర్తిగా ఓడించి, యూరప్ చిత్రపటాన్ని తిరిగి గీయడానికి బ్రిటన్, అమెరికా, సోవియట్ యూనియన్ ప్రతినిధులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కాని, వీరు పోలెండు సమస్యను శాంతిపద్ధతులతో పరిష్కరించగలరో, లేరో, సందేహం. (క్రైమియా సమావేశంలో వారు దీన్ని పరిష్కరించారు. సం.) లుబ్లిన్‌లో ఒక తాత్కాలిక పోలెండ్ ప్రభుత్వం ఏర్పడి పనిచేస్తూంది. దాన్ని సోవియట్‌యూనియన్ గుర్తించింది. కాని, బ్రిటన్ అమెరికాలు గుర్తించలేదు.

పోలెండు సమస్యనుగురించి లండన్‌పోలిష్ ప్రభుత్వ సమాచారమంత్రి యీమధ్యచేసిన కొన్నిప్రకటనలు సోవియట్ యూనియన్‌కి రుచించవు. అతడు పత్రికా విలేఖరులతో యిలా చెప్పాడు: "పోలెండ్ విముక్తిచేయబడిందని మేమునమ్మం. ఇదివరలో జర్మన్ సేనలు, ఇప్పుడు రష్యన్ సేనలు, పోలెండును ఆక్రమించుకున్నాయి. లుబ్లిన్ కమిటీ చేసే పనులు మాకు అంగీకారయోగ్యములు కావు. అదొక కీలుబొమ్మ ప్రభుత్వం. క్రియాస్వాతంత్ర్యం దానికి లేదని మా విశ్వాసం." కాబట్టి, సోవియట్ అధికారం పోలెండులో తాండవమాడుతోందని అతడు మండి పడుతున్నాడు. "దీనిఅర్థం ప్రజాస్వామ్య పరిపాలన అంతరించదమన్నమాట" అని ఆమంత్రి వాపోతున్నాడు.

చరిత్ర చూస్తే

కాని, పోలెండుయొక్క ఆధునిక చరిత్ర చదివితే, యీమంత్రి ప్రజాస్వామ్య విధానం పట్ల చూపేశ్రద్ధ బయటపడుతుంది. 1920లో పోలిష్‌సేనలు ఫ్రెంచివారి సహాయంతో ఉక్రెయిన్‌లో (సోవియట్‌రష్యాకు చెందినది) చాలాభూభాగాన్ని ఆక్రమించుకున్నాయి.

అందులో ఒక సెంటుభూమి కూడా పోలెండుకి చెందదు. పోలిష్‌సేనలు అంతటితో ఆగక, వెర్సేల్‌సంధిషరతులప్రకారం లిథూనియాకు చెందిన విల్నాపట్టణాన్ని సహితం ఆక్రమించుకున్నాయి. ఈవిధంగా, వెర్సేల్ సంధిషరతులప్రకారం పోలెండుకు రావలసిన భూభాగం కంటె ఎక్కువభూభాగం లభించింది. పోలెండులో నివసించేది ఒకేజాతి ప్రజలుకారు. పోసెన్‌రాష్ట్రంలో జర్మన్లు నివసించుచున్నారు. 70లక్షలమంది తెల్లరష్యన్లు, ఉక్రేనియన్‌లు, కూడా పోలెండులోనివసించుతున్నారు. క్రిందటి ప్రపంచయుద్ధం యొక్క పర్యవసానంగా ఫ్రాన్సు యూరపులో అన్నిటి కంటె బలమైన రాజ్యంగా తయారైంది. ఇతర భూభాగాలపై దాడి చేయడానికి పోలెండునుపురికొల్పినది ఫ్రెంచిప్రభుత్వమే. ఎందువల్లనంటే — ఒకవైపు సోవియట్ కమ్యూనిజాన్ని, రెండోవైపు జర్మన్ రాజ్య పునర్నిర్మాణాన్ని, నిరోధించడానికి పోలెండు చక్కగా ఉపకరిస్తుందని ఫ్రెంచి ప్రభుత్వపు ఎత్తుగడ. 1923 లో ఉక్రేనియన్లకు స్వపరిపాలనా హక్కు తిరిగి యిస్తానని మిత్రరాజ్యాలకు పోలెండు వాగ్దానం చేసినప్పటికీ, దాన్ని నిలుపుకోలేదు. ఉక్రేనియాలో అధికారం అంతా పోలిష్ ఉద్యోగస్థులదీ పోలిష్ పోలీసులదీని. ఉక్రేనియన్లకు వీడుస్కూళ్ళు కూడా లేకుండా చేశారు.ఉదాహరణకు, 1912లో గెలీషియారాష్ట్రంలో 2420 ఉక్రేనియన్ పాఠశాలలుండేవి. 1928 లో 745 మాత్రమే! నిజం చెప్పాలంటే, మొదటి యుద్ధం తరువాత కొత్తగా యేర్పడిన పోలెండ్ ప్రెసిడెంట్ విల్సన్ సూత్రాల ప్రకారం కాకుండా, క్లెమెన్సూ సూత్రాల ప్రకారం (ఇతరదేశాల ఆక్రమణకు వెర్సేల్సు సంధి రోజుల్లో అమెరికా అధ్యక్షుడయిన విల్సన్‌వ్యతిరేకి, ఆరోజుల్లోఫ్రాన్సు ప్రధానమంత్రి క్లెమెన్సూ అనుకూలుడు....) పరిపాలించ బడింది. ఇప్పుడు లండన్‌లో ఉన్న పోలిష్ ప్రభుత్వవర్గాలు కూడా యీ సూత్రాల ప్రకారమే పరిపాలన సాగాలనుకుంటున్నారు.

కాబట్టి, రెడార్మీ యిప్పుడు విజయవిహారం చేసుకొంటూ వార్సాలో ప్రకాశించడం, పోలిష్ సేనలు 1920 లో అక్రమంగా లాక్కున్న సోవియట్ భూముల్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం-ఇదంతా లండన్‌కమిటీకి కంటగింపుగా తోచటంలో ఆశ్చర్యంలేదు. ప్రజాస్వామ్య విధానం చెడిపోతోందని యిది దొంగ కన్నీరు కార్చడంలోకూడా ఆశ్చర్యంలేదు తలదాచుకోడానికి దేశాన్ని విడిచి పలాయనమంత్రం చిత్తగించిన పోలిష్ జమీందార్ల భూముల్ని చిరకాలంనుంచి దోపిడీ చేయబడుతూన్న పోలిష్ రైతాంగం లాక్కున్నమాటవాస్తవమే. ప్రజాస్వామ్యవిధానానికి ఎంతమాత్రమూ యిదివ్యతిరేకంకాదు. ఎందువల్లనంటే, పోలెండులోనివసించే ప్రతిపౌరుడు పైవర్గాలతో సమానంగా స్వాతంత్ర్య ఫలితాన్ని అనుభవించడానికి హక్కుఉంది. సౌఖ్యవంతంగా జీవించడానికి అర్హతఉంది. దీన్ని యెవరూ కాదనలేరు. ప్రజాస్వామ్య సూత్రాలకిది ఏ విధంగానూ వ్యతిరేకం కాదు.

"పోలిష్ ప్రభుత్వం" అనే పేరుతో స్వార్థంకొరకు అధికారం చెలాయించదలచుకున్న యిట్టి ముఠాకు బ్రిటన్, అమెరికాలలో కొందరు అభివృద్ధి నిరోధకులు చేయూతనిచ్చి, తమ సోవియట్‌వ్యతిరేకవైఖరిని ప్రదర్శించుతున్నారు. వీరు పైకి మాత్రం రాజకీయ ప్రజాస్వామ్యానికి జోహారులర్పిస్తారు. కాని నిజానికి తమ నియంతృత్వపోకడను కప్పిపుచ్చుకోడానికే యీ శబ్దాన్ని ఉపయోగిస్తారు. ఆర్థికసమస్యల పరిష్కారం వచ్చేసరికి, వీరుప్రజాస్వామ్యాన్ని ఎగరగొడతారు. ఏసిద్ధాంతంకోసం వీరు గొంతుకలు చించుకుంటారో, దానికి పరీక్ష సమయంవచ్చేసరికి తోకలు జాడిస్తారు. కాబట్టి, యుద్ధంలో కొత్తగా విజృంభిస్తూన్న ప్రజాశక్తుల్ని అడ్డుకోడానికే వీరీవిధంగా తుదిప్రయత్నం చేస్తున్నారు. కాని త్వరలోనే వీరి మాయనాటకం ప్రపంచం యెదుట బట్టబయలు కాకమానదు.

ముస్లిం సోదరులకు విజ్ఞప్తి

—///—

అఖిల భారత ముస్లింలీగ్‌వారు మన రాష్ట్రంలో ముస్లింలీగ్ సభ్యులను చేర్చుటకు 31-3-45 వరకు వ్యవధి నిచ్చియున్నారు. ఆంధ్రజిల్లాల్లోని అన్ని తావుల యందును ముస్లింలీగును ఏర్పాటు చేయవలసియున్నది. వివిధ జిల్లాలలోని మహమ్మదీయ ప్రజల సంఖ్యను ఈ క్రింద నిచ్చుచున్నాము.

జిల్లాపేరు		మహమ్మదీయ జనసంఖ్య
విశాఖపట్టణం	జిల్లా	29042
తూర్పుగోదావరి	....	30658
పశ్చిమగోదావరి	....	31833
కృష్ణాజిల్లా	....	76722
గుంటూరు	. .	183298
నెల్లూరు	....	119813
చిత్తూరు	....	97000
అనంతపురం	....	118435
కర్నూలు	....	183332
బళ్ళారి	....	112707
కడప	....	147258

మహమ్మదీయ ప్రజల ఆర్థిక రాజకీయ హక్కులను కాపాడుకొనుటకు ఏకైకమార్గం ముస్లింలీగును బలపరచుటయే. కాబట్టి ప్రతి జిల్లా జనాభాలోను ముస్లింలు విరివిగా ముస్లిం లీగ్‌లో చేరేట్టు ప్రయత్నించవలసినదని ముస్లింలీగు వర్కర్లను, ముస్లింలీగు నాయకులను కోరుచున్నాము.

ఏప్రిల్ నెలాఖరులోగా ప్రాథమిక లీగ్ కమిటీలను ఏర్పరచి తమతమ జిల్లా లీగ్‌ఆఫీసులకును,మద్రాసురాష్ట్ర ముస్లింలీగ్ ఆఫీసుకును (33, ఎర్రబాలుశెట్టివీధి, జార్జిటవున,మద్రాస్) వెంటనే తెలియపరచ వలయును. ఏప్రిల్ మాసారంభములో లాహోర్ పట్టణములో జరుగనున్న అఖిలభారత ముస్లింలీగ్‌మహాసభకు వివిధ జిల్లాలనుండి ప్రతినిధులను పంపించవలసినదిగా జిల్లాలీగ్ కమిటీలను కోరుచున్నాము.

ఇట్లు,
మహబూబ్ ఆదం,
డాక్టరు ఎం. ఎ. ఖాన్,
మొయినుద్దీన్‌అహ్మద్,
(కృష్ణాజిల్లా ముస్లింలీగ్‌ఆర్గనైజర్లు)

★

కృష్ణా జిల్లాలో ముస్లింలీగు ప్రచారం

కృష్ణాజిల్లా ముస్లింలీగు తరపున డాక్టర్ సర్కార్ ఎం. ఎ. ఖాన్, మహమ్మద్ మొయినుద్దీన్ అహ్మద్ సాహెబ్, మహబూబ్ ఆదమ్‌సాహెబ్‌గార్లు జిల్లా అంతటా స్థానికకమిటీలను స్థాపిస్తూ, బహిరంగసభల ద్వారా ప్రచారం గావిస్తున్నారు. ఇదివరకే బందరు, గుడివాడ, పామర్రు, తోట్లవల్లూరు, వుయ్యూరు, గంగూరు, మైలవరం, తిరువూరు గ్రామాలకు వెళ్లారు. వెళ్ళిన ప్రదేశాల్లో ముస్లింలు తమ సంస్థ యెడల, నాయకుల యెడల ఆదరాభిమానాలు చూపుతూ, తమ న్యాయసమ్మతమైన హక్కులకొరకై ఐక్యకృషి చేయడానికి సిద్ధమవుతున్నారు.

మార్చి ఆఖరులోగా జిల్లాలో కనీసం 20 స్థానిక కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా కమిటీ సంకల్పించుకున్నది. ఆనాటితో సభ్యులను చేర్పించడానికి, కమిటీలు యేర్పాటు చేయడానికి కాలనిర్ణయం అంతమవుతుంది.

పోలీసు సోదా

ఏలూరుతాలూకా సర్కిల్ ఇన్‌స్పెక్టరు, యితర పోలీసు వుద్యోగులు గత నెల 23 వ తేదీని పశ్చిమ గోదావరి జిల్లా కమ్యూనిస్టు కమిటీ ఆఫీసులో సోదా జరిపి, "పారిస్ కమ్యూన్", "స్టార్మింగ్ షపర్", "భాక్రవర్ ఉద్యమం" అనే పుస్తకాలను తీసుకుపోయారు.

(3 వ పేజీ తరువాయి) సభను ఆపుచేశారు. వారు బస చేసిన యింట్లో 10 గంటల రాత్రివేళ గూండాల నాయకుడగు ఓనమాల వెంకన్న గొల్లవేషంతో ప్రవేశించాడు. బొడ్డులో జంబియా (మూరెడుపొడవు గలకత్తి) పెట్టుకొని, కార్యకర్తలున్న బసలో ప్రవేశించబోతూంటే, వాలంటీర్లు అతన్ని ఆపుజేశారు. ఇంతలో మిగతా దుండగీండ్రు వచ్చి, వలంటీర్లను కొట్టనారంభించారు. ఈ గల్లంతులో ఓనమాల వెంకన్నకూ, వలంటీర్లకు దెబ్బలు తగిలాయి. మరునాడు, అనగా 13-2-45 తేదీని జనగామ, విసునూరు పోలీసు సబ్‌ఇనస్పెక్టర్లు గ్రామ సంఘాధ్యక్షుని యింటికి వచ్చారు. ఇంట్లోఉన్న జనగామ తాలూకా సంఘకార్యదర్శి గంగుల సాయరెడ్డిగారిని, 60 సంవత్సరముల ఒక వృద్ధ కార్యకర్తను అరెస్టు చేసి దెబ్బలు కొట్టారు. వారితోబాటు ఆరుట్ల రామచంద్రారెడ్డిగారిని, మరినలుగురిని అరెస్టు చేశారు. ఓనమాల వెంకన్నను కొట్టినారని 21 మంది కార్యకర్తలపై పోలీసులు కేసుపెట్టనున్నారని తెలుస్తోంది. వీరంతా యిప్పుడు (1-3-45) రిమాండులో ఉంచబడ్డారు.

ఇట్టి దౌర్జన్యాలను ప్రోత్సహించే దేశముఖులు బద్దరుగుడ్డలు వేసుకొని, జాతీయవాదుల-నాన్‌పార్టీనాయకుల పక్షమున నిలబడి పోటీఆంధ్ర మహాసభకు సభ్యుల్ని చేర్పిస్తూ, విరాళాలిస్తున్నారు. ప్రజల్ని పీల్చుకు తినే దేశముఖులంతా యీ రోజున అచ్చమైన "జాతీయవాదుల" మని చెప్పుకొంటూ తిరుగుతున్నారు. కొంతమంది "జాతీయవాద" నాయకులు యీ కేసులలో దేశముఖులకు సహాయం చేస్తున్నారు.

"ఐక్య రైతుఉద్యమమే జాతీయైక్యతకు పునాది"

★

నెల్లూరుజిల్లా రైతుమహాసభ సందేశం

పదకొండవ నెల్లూరుజిల్లా రైతుమహాసభ ఫిబ్రవరి 25 వ తేదీన ఆత్మకూరులో జయప్రదంగా జరిగింది. ఆత్మకూరు తాలూకాలో ఇంతపెద్ద సభ జరుపబూనుకోవడానికి దే మొదటిసారి. అందులోనూ ఆ తాలూకా వెనుకబడిన ప్రాంతం. పంటలో కొరత ప్రాంత మవడంవల్ల ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. అయినా సభను జయప్రదంగా జరుపాలని పట్టుదల వహించారా తాలూకా రైతులు. వ్యవధి తక్కువగా వున్నప్పటికీ సభా సన్నాహాలన్నీ సకాలంలో పూర్తిచేయగలిగారు. 24 వ తేదీన కొంతమంది ప్రతినిధులతో కలసి సభకు వెళుతుండగా, మా బస్సు ఆత్మకూరుకు 3 మైళ్ళ దూరంలో వుండగానే, కొండ శిఖరంపైనుండి ఎర్రజండా రెపరెపలాడుతూ స్వాగత మిస్తుందా అన్నట్లు ఆకాశపథంలో విహరిస్తోంది. ప్రతినిధుల హృదయాలలో సంతోష తరంగాలు లేచాయి. ఆతరంగాల నుండి 'రైతుమహాసభకుజై', 'ఎర్రజెండాకు జై' అనే విజయ ధ్వానాలు బయలుదేరాయి.

బస్సు దిగగానే నేను తొందర తొందరగా ప్రతినిధులసభ, సమావేశ స్థలమూ చుట్టిరాసాగాను. అప్పటికే 100 మంది ప్రతినిధులు వచ్చారు. సువిశాలమైన మిడిల్‌స్కూలు ఆవరణలో సభావేదిక ఏర్పాటు చేయబడింది. స్థానిక క్లబ్బును వంటశాలగా మార్చారు. ఏవైపు జూచినా ఎర్రజెండాలే. సంధ్యారుణ కాంతుల్లో లీనమై స్వా[illegible]యంతో రెపరెపలాడుతున్నాయి. సభ జయప్రదంగా జరుగుతుందనుకోడానికి ఏర్పాట్లే చక్కనినిదర్శనమనుకుటూ తాత్కాలిక జిల్లా రైతుసంఘ ఆఫీసుకు బయల్దేరా, అక్కడ జిల్లా రైతుసంఘ సభ్యులు వివిధ తీర్మానాలను చర్చిస్తున్నారు. ప్రొద్దుకూకింది. చర్చలు ముగిసాయి. రేపటి బహిరంగ సభకు 6 వేలప్రజలొస్తారని ఒకరూ, 8 వేలొస్తారని మరొకరూ హుషారుగా పంతులాడుతున్నారు. నాకు మాత్రం అంతమంది ప్రజలు రావడం కష్టమేననిపించింది. రాకపోక సౌకర్యాలు లేవు. జమీన్‌రైతు ముఠా "కమ్యూనిస్టుల సభ" అంటూ దుష్ప్రచారం సాగిస్తోంది. ఈ అనుమానాలను నేను వెల్లడించినప్పుడు అంతా నవ్వారు. "జమీన్‌రైతు ముఠాజేసే దుష్ప్రచార మెందులకో ప్రతి రైతుకు తెలుసు. రేపటి బహిరంగసభ ఆ ముఠాకు మరొక గుణపాఠాన్ని నేర్పితీరుతుంద"ని జవాబిచ్చారు.

200 మంది ప్రతినిధులు

25-వ తేది ఉదయం ప్రతినిధుల సభ జరిగింది. 200 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వివిధ సమస్యలను చర్చించి తీర్మానాలు చేశారు. కట్టె, కంప సమస్యల దగ్గరనుండి, కాంగ్రెసు నాయకుల విడుదల సమస్యవరకూ చర్చకు వచ్చాయి. వచ్చిన 200 మంది ప్రతినిధులలోనూ వివిధ రాజకీయ దృక్పథాలు కలిగిన వారనేకమంది వున్నారు. అయినా తీర్మానాలన్నీ ఏకగ్రీవంగా అంగీకరింప బడ్డాయి. 12 గంటలయింది. భోజనాలకు బయల్దేరాం. ప్రజలప్పటికే గుంపులు గుంపులుగా వస్తున్నారు. కూరగాయలూ, మజ్జిగ, పాలూ, కట్టెపుల్లలూ, తమతోకూడా తెచ్చి ఉత్సాహంగా వంటశాలలోయిస్తున్నారు. అప్పటివరకువున్న వాతావరణంమారి సభాస్థలమూ, వంటశాల ప్రాంతం కూడా జనసమ్మర్దముగా మారుతోంది. ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ పండ్లూరి వెంకటసుబ్బారెడ్డిగారు ధనికరైతు. మంచి ఉదారస్వభావం గలవాడు. శ్రమను లెక్కచేయకుండా ప్రశాంతంగా వంటశాలలోని ప్రతి చిన్నవిషయాన్ని అజమాయిషీ చేస్తున్నాడు. తన యింటికి వచ్చిన చుట్టాలకు పెట్టినవిధంగా మహాసభకువచ్చిన రైతులకు భోజనాలుపెట్టాలని ఆయనఉద్దేశ్యం. కామ్రేడ్ జి. సి. కొండయ్య క్షణం తీరికలేకుండా సభా వ్యవహారాలన్నీ సర్దుకుంటుంటే, కామ్రేడ్ రంగయ్య తన వలంటీరు దళాలతో ప్రతి చిన్నవిషయంలోనూ, ఏలోటూరాకుండా కట్టుదిట్టాలు చేసుకుంటున్నాడు. ఇసుకవేస్తే రాలకుండా ప్రజలు సభాస్థలానికి చేరుకోసాగారు. అలావచ్చే ప్రజల్ని ఆత్మకూరు మిట్టమీదినుంచి చూస్తోంటే, శత్రుమూకల్ని పారద్రోలి కోటకుజేరే వీరసైనికుల గుంపులా!! అనిపించింది.

ఊరేగింపు

మధ్యాహ్నం 3 గంటలకు మూడువేల మంది ప్రజలతో బ్రహ్మాండమైన ఊరేగింపు బయలుదేరింది. ముందర కృష్ణాజిల్లా బ్యాండు దళం మిలిటరీ వాయిద్యాలతో కదంత్రొక్కుతూసాగుతూంటే, వెంబడే వాలంటీర్లుబారులుదీరి నడిచారు. ఆ వెనుక ప్రజానీకం, ఆపైన 11 జతల ఎడ్లను పూన్చిన భారతమాత ప్రభ. ప్రభ కిరువైపులా కాంగ్రెసు - ముస్లింలీగు జెండాలు. మధ్య ఎర్రజెండా. అంతా కనులపండువుగాఉంది. ఊరేగింపు పురవీధులగుండా సాగిపోతోంటే, సందుగొందులుగా ఉన్న ఆ వీధులు పట్టక ప్రజలు ఇండ్లపై కెక్కి చూడసాగారు. ఆత్మకూరు ప్రజలు ఆనందమయ నేత్రాలతో ఆహ్వానాలిచ్చారు.

మహాసభ

సాయంత్రం 5 గంటలకు మహాసభ ప్రారంభమైంది. సభ ప్రారంభ మయ్యేసరికి 6 వేల మంది ప్రజలు సభాస్థలములో క్రమపద్ధతులతో కూర్చున్నారు. అందులో 1500 మంది స్త్రీలు. ఇంతమంది స్త్రీలు సభకు రావడం, ఇంత విజయవంతంగా సభ జరగడం నెల్లూరుజిల్లా రైతుఉద్యమ చరిత్రలో ఇదే మొదటిసారి. ఇలాంటి సభలో రైతుజెండా అయిన ఎర్రజెండాను ఎగురవేస్తూ శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారిలా చెప్పారు.

"రైతుసోదరులారా! ఈనాడు మీఎదుట నేనీ ఎర్రజెండాను ఎగురవేయడం బహుతేలికయిన పని. కాని దీనిని ఎల్లవేళలాఆకాశవీధులలో ఎగిరేలా (మిగతా 8 వ పేజీలో)

★ నెల్లూరుజిల్లా రైతుమహాసభకు

కాంగ్రెసునాయకుల సందేశాలు

"శ్రీ ముక్కామల నాగభూషణంగారి అధ్యక్షతక్రింద ఆత్మకూరులో నెల్లూరుజిల్లా రైతుమహాసభ జరుగుతుందని విని ఆనందించాను. మీ సంఘానికి 18000 సభ్యత్వం ఉందనీ, రైతులకు ఇనుమూ, ఎరువులూ, మొదలగునవి యిప్పించుటకు కృషిచేస్తున్నదనీ తెలుసుకొని సంతోషించాను. ఇప్పటి పరిస్థితుల్లో రైతుసంఘం చెయ్యగల పని, నిజంగా యిదేనని నా అభిప్రాయం. మీ ఉత్తరంలో మీరు సూచించిన ప్రకారమే రైతులకు నిర్మాణ యుక్తంగా సేవచేయుటకు వెంటనే పూనుకోవాలి. మీ సభ జయప్రద మవాలని కోరుతున్నాను" అంటూ, భారతజాతీయ కాంగ్రెసు కార్యవర్గ సభ్యులైన డాక్టరు సయ్యద్ మహమ్మద్‌గారు సందేశమంపారు.

"మీ సభకు హాజరు కాజాలక పోయినందుకు చింతిస్తున్నాను. ముఖ్యంగా వ్యవసాయక దేశమైన మన భారతదేశంలో జాతీయ ఉద్యమానికి రైతు వెన్నెముక. కావాల్సిందేమంటే, భూమిని ముక్కలు ముక్కలుగా చీల్చడమనేది మానివెయ్యాలి. దానివల్ల కేంద్రీకరించి వ్యవసాయం చేయడానికీ, ఆధునిక యంత్రాల నుపయోగించడానికీ వీలుపడదు. ఇప్పటి కంటే యింకా ఎక్కువ పండించగల్గితే, ఆహారం విషయంలో మనం స్వయం పోషకంగా వుంటాం. ప్రపంచ చరిత్రలోని ఈనాటి క్లిష్టదశలో మన నాయకులను వెంటనే విడిపించుకోవాలి. కేంద్రంలో జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించాలి. రైతుల్లో ఐక్యత అవసరం, జాతీయ ప్రభుత్వంకోసం, జాతీయ నాయకుల విడుదలకోసం, రైతులంతా ఐక్యమవ్వాలి. దీనికి కాంగ్రెసు - లీగు ఐక్యతకూడా అవసరం................ మీ సభ జయప్రదమవాలని కోరుతున్నాను." అంటూ మద్రాసు మాజీ కాంగ్రెసు మంత్రి డాక్టరు సుబ్బరాయన్‌గారు సందేశమంపారు.

తిరునల్వేలి కాంగ్రెసు నాయకుడూ, అఖిల భారత కాంగ్రెసు కమిటీ సభ్యుడూ అయిన యం. సి. వీరబాహుగారిలా సందేశమంపారు:

"మీలాంటి స్వార్థ త్యాగులైన ఆర్గనైజర్ల సహాయంతో, మీ జిల్లా రైతుమహాసభ మిక్కిలి విజయవంతంగా జరుగుతుందని నాకు నమ్మకముంది. కాంగ్రెసువాదులైనా - కమ్యూనిస్టులైనా, రైతుసమస్య అందరికీ ఒకటే. రైతు తన దైనందిన సమస్యలను పరిష్కరించుకోవడంలోనే మునిగిపోరాదు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడే, కార్మిక కర్షక ప్రభుత్వం ఏర్పరచినప్పుడే, తన పరిస్థితులు బాగుపడతాయనే విషయం రైతాంగం మరచిపోకూడదు. ఇందుకు నెల్లూరి రైతులు దారి చూపెట్టాలి."

ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడూ, 'పీపుల్సువార్' పత్రిక సంపాదకులూ అయిన డాక్టరు అధికారిగారీ విధంగా సందేశమంపారు

"మీ సభకు రాలేనందుకు చింతిల్లుతున్నాను. రైతులకు సహాయం చేయుటకు మీ సంఘం చేస్తున్న కృషిని యింకా బలపరచుటకును, యీనాడు కరువు కాటకాదులచే బాధపడుచున్న ప్రజలకు సేవచేయుటకు మీ సభ సరియైన నాయకత్వం యిస్తుందని ఆశిస్తున్నాను. మీసభ జయప్రదం కావాలని కోరుతున్నాను"

"రైతుల అభ్యుదయమే, మీఏకైక ఆశయంగా పెట్టుకొని జరుపుతున్న రైతుమహాసభ విజయవంతం కావాలని కోరుతున్నాను" అంటూ విశాఖజిల్లా కాంగ్రెసు నాయకులు శ్రీ దిగుమర్తి వెంకట రామస్వామి, యం. యల్. ఏ. గారు సందేశ మంపారు. వీరుగాక కేరళరాష్ట్రరైతుసంఘాధ్యక్షులుకామ్రేడ్ కెరళయన్, అఖిలభారత కిసాన్‌సభ సంయుక్తకార్యదర్శి కామ్రేడ్ యం. ఎ. రసూల్, డాక్టర్ పాలకోడేటి గురుమూర్తిగారు,మద్రాస్ రాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు అధ్యక్షులైన వి. చక్కరయ్యశెట్టి (మద్రాసు మాజీ మేయరు)దానికార్యదర్శి,వి.బాలచంద్రమీనన్ మున్నగు ప్రముఖులు సభ జయప్రదం కావాలని కోరుతూ పంపిన సందేశాలు సభలో చదువబడ్డాయి.

మిమ్ముల నెవరూ అడ్డజాలరు

నెల్లూరుజిల్లా కాంగ్రెసునాయకులు శ్రీ ముత్తరాజు గోపాలరావుగారు స్వయంగా సభకువచ్చి తమ సంతోషాన్ని తెలియజేస్తూ యిలా అన్నారు.

"ఇన్నివేలమంది రైతులిచ్చటకూడి జరుపుకుంటున్న సభకు హాజరై, వారువెల్లడించే అభిప్రాయాలను అర్థంచేసుకోడానికి ప్రయత్నిస్తే, కాంగ్రెసువాదులు మిమ్ములను తప్పకుండా అభినందించి తీరుతారని నా నమ్మకం. ప్రజాకోర్కెలను అర్థంచేసుకోకుండా, ఉద్యమాలపైదాడివెడలడం శోచనీయం.రైతు ఉద్యమాన్ని చీల్చడానికెవరైనా ప్రయత్నిస్తే, వెంటనే మీ ఐక్యబలంద్వారా ఎదుర్కోవాలి. మిమ్ములనెవ్వరూ అడ్డుపెట్టజాలరు. రైతు సంఘాలు కాంగ్రెసుకు అనుబంధంగా వుండాలంటూ రంగాగారీనాడు వెర్రికేకలేస్తున్నాడు. దానికి కొంతమంది కాంగ్రెసువాదులు తాళం వేస్తున్నారు. రంగాగారు మొదటినుండీ తన స్వార్థంకోసరం అనేక ఎత్తులను వేశాడు. అనేక సంఘాలను సృష్టించాడు. ఈనాడు మళ్ళీ గాంధిగారికంటే సత్య, అహింసలపై ఎక్కువ నమ్మకమున్న వానిలా ప్రవర్తిస్తున్నాడు. కరువుకాటకాలతో వేలాదిప్రజలు విశాఖలో మరణిస్తోంటే, ధాన్యం అమ్మవద్దనీ, విపరీతమైన ధరలు కోరండనీ బాధించే ఈ స్వార్థపరుడు, కరువుకాటకాల నరికట్టి ప్రజానీకాన్ని రక్షించే వారిని దేశద్రోహులంటున్నారు. ఈలాంటివారి మాటలను మీరులెక్కచేయవద్దు. ఐక్యతతో ముందుకు సాగండి. సంఘటితశక్తిని పెంపొందించండి.

"రైతుఉద్యమ వ్యవహారాలు గాంధీజీ, రంగాకు, కమలాదేవికి అప్పగించారని పత్రికలలో ఒక వార్త వచ్చింది. దానిపై శ్రీ వెన్నెలగంటి రాఘవయ్యగారు గాంధీజీకి వ్రాస్తే, తానింతవరకూ ఎవ్వరి చేతులలోనూ, రైతుఉద్యమ వ్యవహారాలను పెట్టలేదనీ, రంగాకు, కమలాదేవికి ఆ బాధ్యత వప్పగించారనడం అబద్ధమనీ గాంధీజీ జవాబిచ్చారు. ఈ విషయాన్ని మీరంతా అర్థంచేసుకోండి. మీ సంఘాన్ని బలపరచుకోవడం ద్వారా స్వాతంత్ర్యోద్యమాన్ని బలపరచండి"

ఐక్యప్రపంచకార్మిక ఉద్యమానికి పునాదులు

ప్రపంచ ట్రేడ్‌యూనియన్ సమావేశ ప్రాధాన్యత

పిల్లలమర్రి వెంకటేశ్వర్లు

ఫ్రాన్సు - జర్మనీ యుద్ధంతో ప్రపంచకార్మికోద్యమచరిత్రలో మరో అధ్యాయం ప్రారంభమయింది. ఆనాటి వరకు ప్రజాస్వామిక దేశాలు-ముఖ్యంగా బ్రిటన్, అమెరికా దేశాలలోని ట్రేడుయూనియన్లకు రష్యన్ ట్రేడుయూనియన్లకు మధ్య కలతలే కాని కలియక వుండేదికాదు.

రణరంగమున రష్యన్ సైనికుల వీరోచిత కృత్యాలు, వుత్పత్తిని పెంపొందించుటలో రష్యాకార్మికుల పటిమ కార్మికవర్గాన్నే కాక యావత్ ప్రపంచాన్నికూడా ఉత్తేజపరిచాయి. బ్రిటిష్, రష్యన్ ట్రేడు యూనియనులు జాయింట్ ట్రేడుయూనియన్ కమిటీని స్థాపించుకున్నాయి. బ్రిటన్‌లోకూడ కార్మికవర్గం వుత్పత్తిని 7 రెట్లు అధికంచేసింది. వీరిమధ్య అన్యోన్యత అధికమగుతూ వచ్చింది.

రష్యన్ ట్రేడుయూనియను యీ ఐక్యతను ఆధారంగా చేసుకొని ఐక్యప్రపంచ కార్మికోద్యమాన్ని నిర్మించాలని బ్రిటిష్ ట్రేడు యూనియనులకు సూచించింది.

రెండవ రంగం ప్రారంభమవడంతో యూరప్‌లోని కార్మికోద్యమ వెల్లువ ఫాసిజాన్ని ముంచెత్తివేసి ఆ యా దేశాలకు స్వాతంత్ర్యాన్ని సంపాదించింది రహస్య కార్మికోద్యమం నాజీ ఆక్రమిత దేశాలన్నిటిలోను ముందంజ వేసింది. యూరప్‌లోని ట్రేడ్‌యూనియనులు ప్రపంచ ట్రేడ్‌యూనియన్ సహాయ్యానికై ఆందోళనచేయ సాగాయి. అమెరికా కార్మిక వర్గంకూడ అంతర్జాతీయ కార్మిక సంస్థ నెలకొల్పాలని పట్టుపట్టింది.

ఐక్య కార్మికోద్యమం అవసరం

యుద్ధంముగిస్తే ఘడియలు సమీపించిన కొద్దీ ఐక్యకార్మికోద్యమం అవసరం కార్మిక వర్గానికి కండ్లకు కట్టినట్లుగాకనబడుతున్నది. పీడిత ప్రజాసామాన్యం అతిత్వరగా యుద్ధం ముగిసిపోవాలని వాంఛిస్తున్నారు. ఫాసిజం నాశనమైన మర్నాడు కార్మికోద్యమం సర్వతోముఖాభివృద్ధి గాంచుటకు వీలౌతుంది. జరుగనున్న శాంతి సమావేశంలో వివిధ దేశాలమధ్య సంబంధ బాంధవ్యాలు నిర్ణయించ బడతాయి. శాంతికీ, అభ్యుదయానికీ దోహదమిచ్చే పరిస్థితులను కల్గించి కార్మిక వర్గం నిరాటంకంగా జీవితం గడపటానికి పునాదులు వెయ్యాలి. ఇప్పటివరకు పరిశ్రమలు యుద్ధనిర్వాహణకై పనిచేస్తున్నాయి. యుద్ధకృషిని దృష్టిలో పెట్టుకొని సామాజిక ఆర్థికజీవితం నడుస్తున్నది. యుద్ధానంతరం సామాజిక పునర్నిర్మాణం జరుగబోతున్నది. కార్మికవర్గం తన ఆర్థిక, రాజకీయ హక్కులను కాపాడుకోవాలి. సోవియట్ యూనియన్‌లో తప్ప మిగిలిన దేశాలలో కష్టించి అయినసరే సుఖంగా జీవించేఅవకాశంకార్మికులకులేదు. నిరుద్యోగ పెనుభూతం మీసం మీద చెయిగా వెంటపడిస్తున్నది. రణరంగమున ఫాసిజం ఓడింపబడుతున్ననూ, యింకా దీని వేళ్లుభూమిలో పాతుకునివున్నాయి. వీటిని పెళ్ళగించాలి. ఏమాత్రం వుపేక్షించినా, యీవేళ్ళు తిరిగి మొలకలెత్తుతాయి.

ఇక వలసదేశాలసంగతి. వలసదేశాల పరిస్థితులు బాగుపడాలన్నా, ప్రపంచములో శాంతి సుస్థిరంగా నెలకొల్పబడాలన్నా, వలసదేశాలపై సామ్రాజ్యవాదుల పెత్తనం పోవాలి. ఇందుకు ఐక్యకార్మికోద్యమం అవసరం. తమ కర్తవ్యాన్ని నెరవేర్చుటానికి వివిధ దేశాలలోని ట్రేడ్‌యూనియన్ల ప్రతినిధులు లండనులో సమావేశమయినారు.

ప్రపంచ ట్రేడ్‌యూనియన్ మహాసభ ఫిబ్రవరి 6వ తేదీ ప్రారంభమయింది. మొత్తం 46 దేశాలనుండి 240 మంది ప్రతినిధులు హాజరైనారు. వివిధ దృక్పథాలుకలవారు యిందులో పాల్గొన్నారు. వీరి నిర్ణయాలు భావిసామాజిక జీవితాన్ని మార్చగలుగుతాయి. ప్రపంచ కార్మికోద్యమ చరిత్రలో యింత గొప్ప సమీకరణ, యింత ప్రాముఖ్యమైన సమావేశం యెన్నడూ జరగలేదు. అత్యున్నతమైన బాధ్యతలు ఈసమావేశాన్నెదుర్కొన్నాయి.

ఈసమావేశంలో కుజునిట్సువ్. (రష్యా), థామస్ (అమెరికా), సిట్రిన్ (బ్రిటన్), భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ప్రతినిధులైన డాంగే, ఖడ్గేకర్, ప్రమానిక్ పాల్గొన్నారు. ప్రభుత్వంవారికి తాబేదార్లుగాపనిచేస్తున్న ఎ. కె. పిళ్ళె, ఎ. కె. ముఖర్జీ (రాయ్ గ్రూపు) లు కూడా వెళ్ళారు. చైనా ప్రతినిధులూ ఫ్రాన్సు విముక్తికి కారణభూతులైన ఫ్రెంచి కార్మికోద్యమ ప్రతినిధి హాజరైనారు.

ఈ మహాసభ కార్యక్రమాన్ని నడపడానికి కుజునిట్సువ్, థామస్, ఇసాక్సుగార్లను అధ్యక్షులుగా యెన్నుకున్నారు. ఫ్రెంచి, చైనా ప్రతినిధులను వుపాధ్యక్షులుగను, సిట్రెన్‌ను కార్యదర్శిగానూ యెన్నుకొన్నారు.

ఇసాక్సు మొదటిరోజున అధ్యక్షత వహించి సభనుప్రారంభంచేస్తూ కార్మికోద్యమాన్ని పునరుద్ధరించి విశాలమైన భావాలపై అభివృద్ధిచేయాలనీ, రేపవచ్చిన భవిష్యత్తులో చాలా ఆశాభంగం కలుగుతుందనీ తెలియపరచాడు. బ్రిటిష్‌ప్రభుత్వంపక్షన చర్చిల్, అట్లీగార్లు ప్రతినిధులను ఆహ్వానిస్తూ సందేశాలిచ్చారు.

రాయిస్టుల నైచ్యం

ప్రతినిధుల అర్హతలను విచారించటానికని క్రెడెన్షల్సుకమిటీని ముందు ఎన్నుకోవలసి వచ్చింది. ఈకమిటీలో వివిధదేశాల ప్రతినిధుల విశ్వాసాన్ని చూరగొన్నవారు యెన్నుకొంబడతారు. ఈ లో రష్యా, అమెరికా, బ్రిటన్ ప్రతినిధులు ముగ్గురు. వీరుకాక ఇంకా యిద్దరు ప్రతినిధులు వుంటారు. ఈ మిగిలిన రెండింటిలోను ఒక స్థానానికి డాంగే పేరు సూచించబడింది. భారతదేశగౌరవ ప్రతిష్ఠలను మంటకలుపుతున్న రాయిస్టు ఏ. కె. ముఖర్జీ యీ ప్రతిపాదనను వ్యతిరేకించారు. ఈసాకుతీసుకొని రియాక్షనరీ సిట్రిన్‌వీరిద్దరి అర్హతలు క్రెడెన్షల్సుకమిటీ నిర్ణయించుతుందన్నాడు. డాంగే సభామర్యాదలను కాపాడటానికి తనపేరు వుపసంహరించుకున్నారు.

బ్రిటిష్ ప్రభుత్వపు తొత్తుగా పనిచేస్తున్న యీ రాయిస్టు తన నీచపు బుద్ధిని బయట పెట్టాడేకాని, డాంగేఅర్హతను ఆ ప్రతినిధులలో యెవరూ శంకించలేదు.

25 యేండ్లపాటు భారత కార్మికవర్గానికి సేవచేసి, బలిష్టమైన వుద్యమాన్ని నిర్మించి కార్మికోద్యమానికి తల మానికంగా పరిగణింపబడుతున్నాడు. డాంగే దాదాపు 9 నెలలపాటు బ్రిటన్‌లో సంచారముచేసి, 30 లక్షల మంది కార్మికుల ప్రతినిధుల సమావేశాలలో వుపన్యాసాలిచ్చి బ్రిటిష్ కార్మికవర్గం యొక్క మన్ననలను పొందాడు. ఇతరదేశాల ప్రతినిధులతో సంప్రతించి భారత ట్రేడు యూనియన్ కాంగ్రెస్ పాలసీని ప్రచారంచేసి వారి విశ్వాసాన్ని చూరగొన్నాడు. భారతప్రతినిధి పటిమను గుర్తించియే ఇతరులనేకులెన్నుకోవాలని యితర దేశాల ప్రతినిధులు పట్టు పట్టారు.

కాని రాయిస్టు ప్రతినిధి పానకంలో పుడకలాగాలేచి నిలబడ్డాడు. ట్రేడుయూనియన్ కాంగ్రెసు ప్రతినిధికియీ గౌరవం లభించుట సిట్రిన్ ముఠాకు యిష్టంలేదు. అందువలన యీ రాయిస్టుతొత్తును అడ్డం పెట్టారు. ఈ రాయిస్టు అర్హత, ప్రభుత్వపు అకౌంటు పుస్తకాలలో బయలు పడుతుంది. వీరి బ్రతుకు ప్రభుత్వం యిచ్చే డబ్బుపై ఆధారపడివున్నదని కామన్సు సభలోను, యావత్ ప్రపంచములో కూడా వెల్లడైంది.

సత్వర విజయాలు

తరువాత ఫాసిజాన్ని నాశనంచేయటానికి వివిధ దేశాలు చేసిన కృషినిగూర్చి రిపోర్టులు యివ్వబడ్డాయి. సోవియట్ ప్రతినిధుల నాయకుడు, కుజునిట్సువ్ రిపోర్టు యిస్తుంటే మిగిలినవారు విస్మయానంద భరితులై విన్నారు. ఈ క్రింది మాటలలో తన రిపోర్టును పూర్తిచేశాడు.

సోవియట్ ట్రేడు యూనియనులు డిమాక్రాటిక్ దేశాల ట్రేడుయూనియన్‌లతో చేతులు కలిపి పనిచేయుటకు సంసిద్ధముగా వున్నాయి. డిమాక్రాటిక్ దేశాలలోని కార్మిక వర్గం ఫాసిజాన్ని నాశనం చేయుటకై పోరాడే వారితో కలసి పనిచెయ్యాలి. ప్రత్యక్షంగా ఈ యుద్ధంలో పాల్గొనని స్వీడన్, స్విట్జరులెండు, మొదలైన దేశాలలోని ట్రేడ్‌యూనియనులు, కార్మికవర్గం, తమ ప్రభుత్వాలు జర్మనీకి సహాయం చేయకుండాను, యీ ఫాసిస్టు విద్రోహులకు ఆశ్రయమివ్వకుండా తీవ్రమైన పోరాటం సాగించాలి. స్పెయిన్, పోర్చుగల్, అర్జంటైన్, మొదలగు ఫాసిస్టుదేశాలతో తమ ప్రభుత్వాలు తెగతెంపులు చేసుకోవాలి. కార్మిక సంఘాలు ఇందుకొరకై ఆందోళన చేయాలి. ఆదేశాలలోనిఫాసిస్టు ప్రభుత్వాలను నాశనం చేయుటకుఅచ్చటి ప్రజాసామాన్యానికిసహాయపడాలి. ఫాసిజాన్నినాశనంచేసిత్వరగా యుద్ధం విజయవంతంగా ముగినేటట్లుచూడాలి. యుద్ధములో ఫాసిస్టుదేశాలు ఓడినప్పటికి ఫాసిజం పూర్తిగా నాశనమయిందని భావించరాదు, జర్మనీ తిరిగి మరో యుద్ధానికి దారితీసే అవకాశాలు లేకుండా చెయ్యాలి. మరో యుద్ధం లేకుండా చెయ్యాలంటే యుద్ధానంతరంకూడా ప్రజాస్వామిక దేశాలన్నింటిమధ్య అన్యోన్యత మరింత అధికం కావాలి.

సోవియట్ యూనియన్ ప్రతినిధి రిపోర్టు పూర్తిఅయిన తరువాత బ్రిటన్, ఫ్రాన్సు అమెరికా, చైనా దేశాలప్రతినిధులు రిపోర్టులిచ్చారు. స్టాండింగు ఆర్డర్లకమిటీ (సభాకార్యక్రమ విధానం నిర్ణయించేది) రిపోర్టు చర్చకు వచ్చింది.

యుద్ధం ప్రారంభంలో జర్మనీతో కలసి పనిచేసిన ఇటలీ, బల్గేరియా, రొమేనియా దేశాల ట్రేడుయూనియనులకుకూడా ఆహ్వానాలు పంపాలని యీ రిపోర్టులో సూచించబడింది. కాని యీ సూచనలు ఆమోదింపబడితే, తన ప్రాబల్యం పోతుందని సిట్రిన్ ముఠాదానినివ్యతిరేకించింది. ఈదేశాలలో ట్రేడు యూనియన్ వుద్యమానికి నిలకడలేదనీ, పరిపక్వత చెందలేదనీ వాదించాడు. అనేకగెరిల్లా పోరాటాలు జరిపి, తమస్వాతంత్ర్యాన్నిస్థాపించుకొనుటకై సర్వము ఒడ్డిన యీ వీరులకు ప్రపంచ కార్మిక మహాసభలో స్థానం లేదంటున్నాడు. వీరంతా పాల్గొనేటట్లయితే తన రియాక్షనరీ పాలసీ కొనసాగదు. ఇందువల్లనే వీరిని వెలివెయ్యాలని వాదించుతున్నాడు సిట్రిన్.

ఈ కమిటీ రిపోర్టు ప్రకారం ప్రతి తీర్మానము ⅔ మెజారిటి పొందగల్గుతేనే ఆ తీర్మానం సభ ఆమోదించినట్లు సభాభిప్రాయముగ అంగీకరించబడుతుంది. కాని సిట్రిన్ ముఠా దీన్నికూడా, రష్యన్ ప్రాబల్యం అధికమగుతొందనే భయంతో వ్యతిరేకించింది.

తరువాత ఫ్రాన్సు, సోవియట్, లాటిన్ అమెరికా ప్రతినిధులు సిట్రిన్ దృక్పథాన్ని నిశిత విమర్శనకు గురిచేశారు. పోలెండు జకోస్లావేకియా, నార్వే దేశాల ట్రేడుయూనియన్ ప్రతినిధులను ఆహ్వానించి, బల్గేరియా రుమేనియా, ఇటలీ, లుబ్లిన్ దేశాల ట్రేడు యూనియన్ ప్రతినిధులను ఆహ్వానించకపోవటానికి కారణంయేమిటని నిలవదీసి అడిగారు. ఇందుకు కారణం పోలెండు, జకోస్లావేకియా, నార్వే దేశాల ట్రేడుయూనియనులు పారిపోయి తమ కేంద్రాలు లండన్‌లో పెట్టుకోటమే. పరిపక్వతచెందిన ట్రేడుయూనియనిజం అంటే, ఫాసిజాన్ని యెదుర్కొనలేక వెన్నిచ్చి పారినవారితోకూడినదేననా? సిట్రిన్ అభిప్రాయం! సిట్రిన్ దృక్పథాన్ని బలపరచింది మన రాయిస్టు తొత్తులు-లండనులో పీఠం వేసుకుని కూర్చున్న పోలెండు ప్రతినిధులు మాత్రమే.

కాని చివరకు ఇటలీ, బల్గేరియా, పోలెండు రుమేనియా, లుబ్లిన్ ట్రేడుయూనియనులకు కూడా ఆహ్వానాలు పంపుటకు అంగీకరించారు. ఓటింగు పద్ధతిపైకూడా అంగీకారం కుదిరింది. మహాసభను నడుపుతున్న స్టాండింగు ఆర్డర్ల కమిటీ, శాంతిస్థాపన కమిటీ ప్రపంచ ట్రేడు యూనియన్ కమిటీలను వెయ్యాలని నిశ్చయించింది. ఆ రెండు (మిగతా 7వ పేజీలో)

(6వ పేజీ తరువాయి) కమిటీలలోను ఇండియా తరపున ఎవరు ప్రాతినిధ్యం వహించాలి: అనే విషయం ఓటింగుకు పెట్టారు. రాయిస్టు గ్రూపును సిట్రిన్‌ముఠా మాత్రమే బలపరచింది. అధికసంఖ్యాకులు ట్రేడుయూనియన్ కాంగ్రెసు ప్రతినిధులను గుర్తించారు. ఖడ్గికర్, డాంగేగార్లు శాంతిస్థాపనకమిటి, ప్రపంచ ట్రేడుయూనియన్ కమిటీలకు యెన్నుకోబడ్డారు.

అభివృద్ధినిరోధకుల ప్రాకులాట

తరువాత అంతర్జాతీయ ట్రేడుయూనియన్ ఫెడరేషన్ స్థాపన విషయం చర్చకు వచ్చింది. నామమాత్రావసిష్టమై వున్నటువంటి ఆమ్‌స్టరుడమ్ ట్రేడుయూనియన్ ఫెడరేషనునే బలపరచాలని సిట్రిన్‌ముఠా వాదించింది. కాని యీ ఫెడరేషన్ చరిత్ర నికృష్టంగా వున్నది. కార్మికవర్గంయొక్క అభిమాన విశ్వాసాలను చూరకొనలేదు. అంతేగాకుండా, కార్మికవర్గానికి ద్రోహం చేసింది. సామ్రాజ్యవాదుల కీలుబొమ్మగా నిలచింది.

ఈ ఆమ్‌స్టరుడమ్ ఫెడరేషనులో మొత్తం 12 దేశాల కార్మిక సంఘాలు మాత్రమే వుండేవి. వాటిలో ముఖ్యమైనవి బ్రిటిష్ ట్రేడ్‌యూనియన్‌కౌన్సిల్, అమెరికాలోవున్న లేబరుఫెడరేషను. 1939 మ్యూనిక్ వుదంతం అనంతరం యీ ఫెడరేషన్ నామమాత్రంగా మాత్రమే వున్నది.

కార్మికోద్యమానికి వేరుపురుగులాగా పనిచేసి ఫాసిస్టు పరిపాలనకు దోహదంచేసిన యూరప్‌లోని సోషల్ డిమాక్రేట్‌లు తమ పెత్తనం సాగించుకోటానికి యీ సంస్థను నిర్మించారు. అప్పటి జర్మని, ఆస్ట్రియా, బెల్జియం, హాలెండు దేశాల ట్రేడ్‌యూనియనులు, దానికి ఆయువుపట్టు. ఆసియా, ఆఫ్రికాలలోని కార్మికవర్గ పోరాటాలతో వీరికి ప్రసక్తిలేదు. రష్యా ట్రేడ్‌యూనియనులను యీ సంస్థలో పాల్గొనకూడదని నిషేధించారు. ఒకే దేశంలో ఒకే ట్రేడ్‌యూనియన్ సంస్థ మాత్రమేఅఫిలియేటు కావాలనే సాకుచెపుతూ తమ విద్రోహపాలసీకి వ్యతిరేకంగాఉన్న ట్రేడ్‌యూనియన్‌లకు దీనిలో ప్రవేశం లేకుండా చేశారు. అందువలననే అమెరికాలో బలిష్టముగావున్న యిండస్ట్రియల్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసును కూడా దీనిలో చేర్చుకోలేదు! యూరప్ అంతా హిట్లర్ పాదాక్రాంతమవుతుంటే, చేతులు జోడించుకొని కూర్చుని తన అసమర్థతను వెల్లడిచేసింది.

దీన్ని పునరుద్ధరించుట అసంభవం. నూతన ప్రపంచవ్యవస్థలో దీనికి తావులేదు. కార్మిక వర్గ విశ్వాసాన్ని చూరగొన్న మరియొక అంతర్జాతీయ ఫెడరేషన్ మాత్రమే నాయకత్వం వహించగలదు. ఈ వుద్దేశాలతో అమెరికా ప్రతినిధి హిల్‌మన్ నూతన అంతర్జాతీయ ట్రేడ్‌యూనియన్ ఫెడరేషనును నెలకొల్పాలని, యీ మహాసభ ఆశయాల ననుసరించి కార్యక్రమాన్ని కొనసాగించుటకు వివిధదేశాల ప్రతినిధులతో గూడిన కంటిన్యుయేషన్‌కమిటీని యేర్పర్చాలని ఒక తీర్మానాన్ని తీసుకొనివచ్చాడు.

శిధిలావస్థలోవున్న (పూర్వపు) ఫెడరేషన్ కార్యదర్శి అయిన 'స్కెవినల్సు' తన అంతర్జాతీయ ట్రేడ్‌యూనియన్ల ఫెడరేషనునే బలపరచాలని కోరాడు. రష్యా తమ ఫెడరేషనులో చేరనందుకు విమర్శించాడు. ఈవిమర్శకు సోవియట్ ప్రతినిధి సమాధానమిస్తూ గత 25సం॥లోపుగా సోవియట్ యూనియన్‌కు చేరడానికి అవకాశం యివ్వలేదన్నాడు.

సిట్రిన్ తన పాతసంస్థ నశించి దానిస్థానే నూతనసంస్థ నిర్మించనున్నదనేటప్పటికి కంపించిపోయినాడు. ఈ నూతనసంస్థ స్వరూపం యెల్లావుంటుందో ఆచూకీ తెలుస్తేనేగాని బలపరచజాలనన్నాడు. దీన్ని నడపటానికి డబ్బువిషయం తేలాలన్నాడు. ఈ సంస్థలో రాజకీయాలకు తావు వుండకూడదన్నాడు.


ఇండియా ప్రతినిధి ఖాడ్గికర్ సిట్రెన్‌కు సమాధానమిస్తూ ఆమ్‌స్టరుడమ్ ఫెడరేషన్ నిరర్ధకమైనదని రుజువుచేశాడు. ఐక్య కార్మికోద్యమాన్ని నడపడానికి నూతనసంస్థ అవసరమని వాదించాడు. రాజకీయాలు కూడదనే సిట్రిన్ వాదనను ఖండించుతూ ఫాసిస్టు వ్యతిరేకత రాజకీయాలు కాదా అని ప్రశ్నించాడు.

అమెరికా ప్రతినిధి హిల్‌మన్ సూచన అంగీకరించ బడింది. ఐక్య కార్మికోద్యమ నిర్మాణానికి పునాదులు వేయబడినాయి. ప్రపంచ ట్రేడ్‌యూనియన్ ఫెడరేషన్ 1945 సంవత్సర మంతమొందేలోపుగా సమావేశ పరచడానికి 41 మంది ప్రతినిధులతో గూడిన ఒక కమిటీ నియమించ బడింది. మన భారతదేశ పక్షన కామ్రేడ్ డాంగేను ప్రతినిధిగా ఎన్నుకున్నారు. ఈ కమిటీకి పారిస్ (ఫ్రాంసులో) కేంద్రస్థానంగా గుర్తించారు. ప్రజాస్వామిక ప్రపంచ ట్రేడ్‌యూనియన్ ఫెడరేషన్ స్థాపించాలని నిర్ణయించారు.

ఈమహాసభలో శాంతి స్థాపననుగూర్చి, యుద్ధానంతర పునర్నిర్మాణాన్నిగూర్చి కూడా చర్చించబడింది. ఈ విషయంపై డాంగే మాట్లాడుతూ, ప్రాచ్యదేశాలలో శాంతి సుస్థిరంగా వుండాలంటే ఇండియాలాంటి వలస దేశాలకు స్వతంత్రం ఇవ్వాలన్నాడు. అందుకు ట్రేడ్‌యూనియన్లు ఆందోళన చెయ్యాలని సూచించాడు. ఖడ్గేకర్ శాంతిస్థాపన తీర్మానానికి సవరణ ప్రతిపాదించాడు. వలస రాజ్యాల పద్ధతి అంతమొందించి, దానితోబాటు దోపిడీవిధానాన్ని రద్దుచేసి, స్వతంత్ర కార్మికోద్యమాభివృద్ధికి అవకాశాలు కల్పించాలనీ, స్వతంత్ర ప్రభుత్వాల అమర్చబడని దేశాలన్నింటికీ అట్లాంటిక్ చార్టరు వర్తింపాలనీ సూచించాడు. ఇది ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

అమెరికా ప్రతినిధి యే పరిశ్రమలలోను జాతి, మత, కుల, రంగు భేదాలు పాటించగూడదని, నిర్బంధించి పనిచేయించుకునే పద్ధతి రద్దుచెయ్యాలని, స్త్రీ పురుషులకు సమానమైన వేతనాలుండాలని, రంగుభేదము పాటించకుండా తెల్లవారు తమ ట్రేడ్‌యూనియన్లలోకి యితరులను చేర్చుకొనాలని, యీ పద్ధతులపై శాసనాలు చెయ్యాలని సూచించారు. ఆసూచన ఆమోదింపబడి అన్ని దేశాలలోను అమలుజరిగేటట్లు నూతన ఫెడరేషన్ బాధ్యత వహించాలని నిర్ణయించబడినది.

శాంతి స్థాపన విషయంలో యాల్టా సమావేశ తీర్మానాలను బలపరచుతూ- వాటిని జపానుకుకూడ వర్తింపజేసి, మెకాడాను (చక్రవర్తి) యుద్ధ ఖైదీగా విచారణ చేయాలని సూచించబడింది.


కామ్రేడ్ యస్. ఎ. డాంగే

ముగింపు

ఈ సమావేశంలో ప్రతినిధులందరు తమ దృక్పథాలను వెల్లడిచేశారు. నేడు కార్మిక వర్గాన్ని యెదుర్కొనుచున్న సమస్యలన్నింటిపైన సూచనలిస్తూ నూతన భావాలకు, ఆశయాలకు అనుగుణ్యముగావుండే నూతన ట్రేడ్‌యూనియన్ ఫెడరేషను స్థాపించ పనుకట్టారు. భిన్నదృక్పథాల వారందరు చర్చలలో పాల్గొన్నప్పటికీ, ముఖ్యమైన సమస్యలపట్ల యేకాభిప్రాయముతోనే తీర్మానాలు చేశారు. పొంచి పొంచి చూస్తున్న ఫాసిస్టులకు సమ్మెటపెట్టుగా ట్రేడ్‌యూనియన్ మహాసభ ఐక్యనిర్ణయాలకు వచ్చింది. రీయాక్షనరీలు ఓడిపోవుటయేకాక ప్రపంచ కార్మికోద్యమానికి లొంగవలసివచ్చింది.

మన ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ప్రతినిధులు భారతదేశ గౌరవప్రతిష్ఠలను పెంపొందించారు. భారత దేశ సమస్యపట్ల మనజాతీయ దృక్పథాన్ని ప్రపంచ కార్మికప్రతినిధులకు విశదపరచి వారి సానుభూతి సంపాదించగల్గారు. జాతీయకాంగ్రెస్‌పై జాతీయ విద్రోహులైన రాయిస్టులు దుమ్మెత్తిపోసి అపనిందలపాలు చేస్తుంటే, ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు ప్రతినిధులు కామ్రేడ్ డాంగే, ఖడ్గేకర్, ప్రమానిక్, భారతదేశంలోని యదార్థ పరిస్థితులనుచాటి యీ రాయిస్టుల నోళ్లు నొక్కివేశారు.

భారత దేశ సమస్యలపై వివిధ దేశీయుల అభిప్రాయాలను యిందుతో పొందుపరచుతాం:

చైనా లేబరు అసోసియేషన్ కార్యదర్శి అయిన 'లియు' "మహాత్మగాంధీ, పండిత నెహ్రూలంటె మాకు అపారమైన గౌరవం వున్నది. నెహ్రూ విడుదలైతే మన స్వాతంత్రోద్యమాలకు గొప్పవిజయమని భావించాలి. ఇండియా, చైనాల కార్మికోద్యమాలు కలసి ఆసియా దేశీయుల జీవిత అవసరాలను సంపాదించుటకు, వీరిజీవిత ప్రమాణాలను ఎక్కువచేయుటకు, కృషి చెయ్యాలి." అనిపలికాడు.

క్యూబా కార్మికప్రతినిధి నెహ్రూ మొదలగు కార్మికనాయకుల విడుదల చెయ్యాలని వుద్ఘాటించాడు.

అమెరికా ప్రతినిధి లేటన్ అట్లాంటిక్ ఛార్టరు ఇండియాకు వర్తించాలన్నాడు.

అమెరికా కార్మికనాయకుడు హిల్‌మన్ "అమెరికా దేశస్థులంతా ఇండియా స్వతంత్రం పొందాలని కోరుతున్నారు. భారత దేశకోర్కెలను అమెరికన్ ప్రజాభిప్రాయం బలపరచుతున్నద"న్నాడు. ఈప్రపంచ ట్రేడుయూనియన్ ఫెడరేషన్ తీర్మానాలు ఇండియా మొదలైన వలసదేశాల స్వతంత్ర సంపాదనకు చేయూత నిస్తాయని వ్యక్తపరచాడు.

ప్రపంచ కార్మికవర్గ ప్రతినిధుల భావాలు యీ విధంగా వున్నాయి.

భారత దేశముపట్ల యింత సానుభూతికరమైన భావాలు కల్గించిన డాంగే, ఖడ్గేకర్, ప్రమానిక్‌గార్లు స్తవనీయులు.

పొగాకులోకం

గుంటూరుజిల్లా రైతుసంఘం, గుంటూరు పుగాకు మార్కెటుకమిటీ ఎన్నికలలో పోటీజేసి అఖండవిజయం గాంచింది. అప్పటి నుండి కమిటీ పొగాకు రైతులకు వుపయోగకరంగా ఎంతో కృషి చేస్తూవుంది. ఎరువులు, బారనుసామాన్లు, బాటరీలైట్లు మొదలైనవి ఇప్పించటంలోనూ, పొగాకు తూకంలో మోసం జరగకుండా చూడటంలోనూ, ఇంకా అనేక విధాలగానూ కృషిచేసింది. పొగాకు రైతుల కో-అపరేటివ్ సొసైటీలు స్థాపించుటకు ప్రయత్నిస్తూ వుంది. అన్నిటికన్న ప్రధానంగా చెప్పుకోదగ్గది సమాచార కేంద్రాన్ని నడపటం. అందుకు తోడ్పాటుగా "పొగాకులోకం" అనే పత్రికను రెగ్యులర్‌గా ప్రకటించుతూ రావటం.

శ్రమపడి పండించే రైతుకు, యంత్రాగారములకు చేర్చే వ్యాపారస్తుడికి, యంత్రాగారముల స్థాపింపనున్న దేశీయులకు సేవజేయుటయే ఈబులెటిన్ ఉద్దేశం.

ఈ పత్రికలో వ్యాసాలు బాగా అనుభవజ్ఞులగు రైతులు, వ్యవసాయశాస్త్రజ్ఞులు మొదలైన వారిచే వ్రాయబడుతూ వున్నాయి. మార్కెటుపరిస్థితులనుగూర్చి వ్యవసాయాభివృద్ధినిగూర్చి తేలికభాషలో ప్రజల కర్థమయ్యే రీతిని ఈవ్యాసాలు వుంటున్నాయి. ఇట్టి పత్రికను ప్రకటిస్తున్నందుకు గుంటూరు టుబాకో మార్కెటుకమిటీని అభినందించవలసియున్నది.

ప్రజాశక్తి
★
భారత కమ్యూనిస్టు పార్టీ
ఆంధ్ర కమిటీ పత్రిక
★
సంపాదకవర్గం:
మద్దుకూరి చంద్రశేఖరరావు (సం)
కంభంపాటి సత్యనారాయణ
పుచ్చలపల్లి సుందరయ్య
తుమ్మల వెంకటరామయ్య
చలసాని వాసుదేవరావు

కరువు నివారణకు పూనుకుంటూ ముందుకు సాగిపోవాలి

నెల్లూరు మహాసభలో రైతులకు విజ్ఞప్తి

(5 వ పేజీ తరువాయి) కాపాడుకోవడంలోనే ఉంది బాధ్యత. ఈనాడు కొంతమంది, ముఖ్యంగా రంగా ప్రభృతులు, మన జెండాను తీసివేయాలంటున్నారు. ఆవిధంగా మన వర్గచిహ్నాన్నే సవాల్ చేస్తున్నారు. ఎర్ర జెండా జాతీయ జెండాకు వ్యతిరేకమని దుష్ప్రచారం చేస్తున్నారు. గత పది సంవత్సరాల కాలంనుండి ఎర్రజెండాక్రింద మనం బ్రహ్మాండమైన ఉద్యమాన్ని నిర్మించుకున్నాం. జాతీయోద్యమాన్ని దేశంలోని మారుమూలలకు కూడా తీసుకుపోయాం. ఈజెండా క్రింద రైతులు సంఘటితమయ్యేకొలదీ మన జాతీయోద్యమం ద్విగుణీకృతంగా బలపడుతోంది. రైతులకు తమ వర్గచిహ్నంగా ఎర్ర జెండా వుండాలని శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ చెప్పిన మాటలను మన వ్యతిరేకులు ఒకసారి జ్ఞప్తికి తెచ్చుకోవాలి.

"మనజెండా కమ్యూనిస్టుపార్టీ జెండాఅనీ, రష్యా జెండాయనీ ఇంకో అబద్ధమాడుతున్నారు. కమ్యూనిస్టుపార్టీ జెండాపై అయిదు కోణాలు కలిగిన (అయిదు ఖండాలకు చిహ్నంగా) నక్షత్రం వుంటుంది. మన జెండాకు అదిలేదు. మన జెండా ఎర్రజెండా- అది కష్టపడి పనిచేసే శ్రమజీవుల చిహ్నం. సుత్తి-కొడవలి - కూలీ, రైతుల ఐక్యతను సూచిస్తున్నాయి. ఐక్యతతో కార్మికులు, కర్షకులు పాటుపడితేనేగాని స్వాతంత్ర్యాన్ని సాధించలేము. కష్టాలను పోగొట్టుకోజాలము. కాబట్టి రైతులు, కూలీలు ఐక్యతతో ఈజెండా క్రింద సంఘటితమై, మన హక్కులకొరకు పోరాడుదాం. జాతీయోద్యమాన్ని బలపరచి, విచ్ఛిన్నాన్ని అరికట్టి స్వాతంత్ర్యాన్ని సాధించుదాం. ఇదే మనమీనాడు తీసుకోవలసిన ప్రతిజ్ఞ. ఆవిధంగా పిడికిలి బిగించి ఆందరం మన ఎర్రజెండాకు ఒకసారి వందనం చేదాం" అంటూ జెండాను ఎగురవేశారు. బ్యాండు దళం "జయ్ జయ్ జయ్ - అరుణపతాకకు జై" అనే గీతం పాడింది.

రైతులందరికీ ఒకేరైతుసంఘం

ఆహ్వాన సంఘాధ్యక్షులైన శ్రీ పండ్లూరి వెంకట సుబ్బారెడ్డిగారు సభికులకు ఆహ్వానమిస్తూ ఇలా ప్రబోధించారు.

"ఆంధ్రరాష్ట్ర రైతుసంఘం .... వ్యవసాయ పనిముట్లకు ఇనుముకొరకూ, సక్రమమైన ధాన్యంపురేట్లకూ, అర్థంలేని ప్రభుత్వ చట్టాలను మార్పుచేయుంచుటకూ, ఈనాం, ఇర్రిగేషన్ చట్టాలలో ప్రజలకనుకూలమైనమార్పులకొరకూ, నిల్వప్రాంతాల ధాన్యాన్ని సక్రమధరలకు కరువు ప్రాంతాల ప్రజలకుచేర్చుటకూ, అచ్చుబడాన్యపుకొరతను తీర్చుటకూ,ఇంకాఎన్నో సమస్యలను పరిష్కరించుటకూ కృషిచేసింది.

"దాని అనుబంధశాఖలైన మన జిల్లా, తాలూకా సంఘాలు గొప్పగా పనిచేశాయి. మన తాలూకా (ఆత్మకూరు) లో రైతు ఉద్యమం బాల్యావస్థలోవున్నా, మన తాలూకా రైతులు రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా, వైజ్ఞానికంగా, వెనుకబడివున్నా, దాదాపు మన తాలూకాలో 40 గ్రామాలలో 6000 సభ్యత్వంగలిగి, రైతుల నిత్య అవసరాల్లో చక్కని మార్గం చూపుతూ, రైతుసంఘం పనిచేస్తున్నది. మెట్టధాన్యాల వసూలు స్కీములోని అవకతవకలను సవరించుట, సక్రమమైన ధాన్యపురేటును నిర్ణయించుట, వ్యవసాయ పనిముట్లు సక్రమ ధరకు అందించుట, గండికోట ప్రాజెక్టు మొదలైన ఎన్నో సమస్యలలో పాల్గొని రైతుసంఘం చక్కని కృషిచేసింది. 6 వేల మంది సభ్యులుగల రైతుసంఘం యింత పనిజేయగలిగితే, ఇంకా మిగిలిన గ్రామాల రైతులు ఏకోన్ముఖంగా రైతు జండా క్రింద నిలబడి, సంఘాభివృద్ధికి కృషిజేస్తే మన కోర్కెలను ఎవరడ్డగలరు? కావున రైతులు కుటుంబ సమేతంగా రైతుసంఘంలోజేరి రైతుఉద్యమాన్ని ఒక బలమైన ఉద్యమంగా జేయాలి.

"అందరంకలసి పనిచేస్తేనే మెవరైనా ఫలితాన్ని పొందగల మనుకునే ఈ రోజుల్లో కొంతమంది, రైతుఉద్యమాన్ని చీల్చి — ముక్కలుముక్కలుజేసి తమ స్వంత పలుకుబడిక్రిందికి రైతులను తెచ్చుకోవాలని ప్రయత్నించడం విచారకరం. రైతుసంఘం ఏరాజకీయ పార్టీకి తోక కాగూడదు. రైతుసంఘం భూమిపై ఆధారపడి పనిజేసే వారందరిది. కాంగ్రెసులో జేరితేనే రైతుసంఘంలో చేరాలనడ, లేక మనిషికి ఒక రైతుసంఘాన్ని పెట్టాలనడం, రైతులకు లాభం చేయకపోగా నష్టంచేయడ మవుతుంది. ఏపార్టీకి చెందినవారైనా, ఏ పక్షనికి చెందినవారైనా, రైతులందరికి ఒకే రైతుసంఘం వుండాలి. అదే అఖిలభారత రైతుసంఘం..........కావున రైతులు పోటీ సంఘాలకు తావివ్వక, అన్ని పక్షాలు కలసి రైతుసంఘంలో విరివిగా జేరి సంఘాభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరుతూ, మహాసభకు ధనధాన్యాలిచ్చి తోడ్పడినవారికి, వ్యయప్రయాసలకోర్చి మహాసభకువచ్చి పాల్గొని, విజయవంతంచేస్తున్న మీకు వందనము లర్పిస్తూ నా ఉపన్యాసాన్ని ముగిస్తున్నాను."

ప్రారంభోపన్యాసం

కేంద్ర కిసాన్‌కౌన్సిల్ సభ్యులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగారు సభను ప్రారంభిస్తూ, యిలా ఉపన్యసించారు :

సోదరులారా !

మన జిల్లా రైతుమహాసభను ప్రారంభించే అవకాశం కలిగినందుకు నాకు చాలాసంతోషంగా ఉంది. ఈ నాడు ఇన్నివేలమంది జిల్లా రైతులు యిక్కడ సమావేశమవడం చూస్తే మన ఉద్యమం ఎంతగా అభివృద్ధి చెందిందీ తెలుస్తోంది. పన్నెండు సంవత్సరాలనుండి మనం ఈ ఉద్యమాన్ని నిర్మిందుకుంటూవస్తాం. రైతుఉద్యమాన్ని నిర్మించడంద్వారా జాతీయోద్యమాన్ని బలపరచాం. మారుమూల గ్రామాలకు కూడా జాతీయోద్యమాన్ని తీసుకువెళ్ళాం. ఈవిధంగా నిర్మింపబడిన మన ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారు. ప్రపంచమంతటా అనేకదేశాల ప్రజలు ఐక్యతతో ముందుకు సాగిపోతూ,ప్రజారాజ్యాల్ని సృష్టించుకుంటూ వుంటే, మన దేశంలో హిందూ ముస్లిం ఐక్యతను సాధించగలిగితేనే స్వాతంత్ర్యాన్ని పొందగలుగుతామనే సత్యాన్ని గుర్తించకుండా కొందరు వ్యక్తులు హిందూ-ముస్లిం భేదాలను యింకా ఎక్కువ చేస్తున్నారు. విశాల జాతీయసంస్థ అయిన కాంగ్రెసును సంకుచిత పరచ జూస్తున్నారు. కాంగ్రెసులో కమ్యూనిస్టులుండ గూడదనీ, ప్రతి ప్రజాసంఘానికీ పోటీ సంఘాన్ని పెట్టాలనీ, ప్రయత్నిస్తున్నారు. మన రాష్ట్రంలో రంగా, కాశేశ్వరరావు, కల్లూరి సుబ్బారావుగార్లు పోటీ సంఘాలు పెడుతూ, రైతుఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయజూస్తున్నారు. రైతుఉద్యమాన్ని చీల్చడమంటే, జాతీయోద్యమాన్ని బలహీనపరచడమే అవుతుంది. ఈసత్యాన్ని కాంగ్రెసువాదులు గుర్తించాలి. ముఖ్యంగా రైతాంగం ఐక్యతతో ఈ విచ్ఛిన్నకర ప్రయత్నాలను అరికట్టాలి.

"ఇంతితో ఆగలేదు వీరివ్యతిరేకత. కమ్యూనిస్టులను నాశనం చేయాలనే వెర్రిఆవేశం కొద్దీ కమ్యూనిస్టులన్నా, సామ్యవాదులన్నా ప్రజలలో వ్యతిరేకత పుట్టించాలని కూలీ-రైతు రాజ్యమైన సోవియట్ రష్యాపై విపరీతంగా దుష్ప్రచారం చేస్తున్నారు. రష్యాలో రైతులకు హక్కులేమీ లేవనీ, కార్మికుల నియంతృత్వంక్రింద బానిసలుగా పడివున్నారనీ, రష్యాకూడా సామ్రాజ్యవాదదేశముగా మారిపోయిందనీ దుష్ప్రచారం చేస్తున్నారు. ఇంగ్లండు, అమెరికా మొదలైన దేశాలలోని పెట్టుబడిదారులూ, సామ్రాజ్యవాదులూ, సరిగా ఇలాంటి దుష్ప్రచారమే యిదివరకు జేశారు. కాని ప్రజానీకాన్ని నమ్మించలేకపోయారు. అలా ప్రచారంచేసిన వారే యిపుడుసోవియట్‌రష్యానుపొగుడుతున్నారు. ఎందువల్ల? లక్షోపలక్షల ప్రాణాలను బలియిచ్చి, నాజీనిరంకుశత్వంనుండి ప్రపంచ ప్రజానీకాన్ని రక్షించింది సోవియట్ రష్యా. వీరరెడార్మీ విజయ 'దుందుభులు మ్రోగిందుకుంటూ బెర్లిన్‌పైకి కదం త్రొక్కుతూంటే, విముక్తియూరపుదేశాల ప్రజలు, ఐక్యతతో అభివృద్ధి నిరోధకులను అణగద్రొక్కుతూ, ప్రజారాజ్యాల్ని నిర్మించుకుంటున్నారు. అలాంటి ప్రజలందరి యొక్క అండ మన స్వాతంత్ర్యోద్యమానికుంది. మనం మన శక్తివంచనలేకుండా కృషిచేయాలి. హిందూ-ముస్లిం ఐక్యతను సాధించాలి. విచ్ఛిన్నకర దర్యాల నరికట్టి, కాంగ్రెసును విశాల జాతీయసంస్థగా పెంపొందించాలి. స్వార్థపరుల విచ్ఛిన్నకారుల దర్యాల నరికట్టాలి. ఐకమత్యమైన - ఐక్యరైతు ఉద్యమాన్ని నిర్మించాలి ఐక్య రైతుఉద్యమమే జాతీయైక్యతకుపునాది. అందుచేత ఐక్యరైతుఉద్యమ నిర్మాణానికై మీరంతా తీవ్రకృషి చేయాలని కోరుతూ యీ సభను ప్రారంభిస్తున్నాను."

తరువాత ఆహ్వానసంఘ కార్యదర్శి కామ్రేడ్ జి. సి. కొండయ్య ప్రముఖ ప్రజానాయకులు పంపిన సందేశాలను సభలో చదివారు.

అధ్యక్షోపన్యాసం

పిమ్మట మహాసభాధ్యక్షులు ముక్కామల నాగభూషణంగారు తమ అధ్యక్షోపన్యాసంలో రైతుసంఘాలు సాధించిన విజయాలనుచెప్పి, రైతాంగాన్ని ఈ నాడు ఎదుర్కొంన్న సమస్యలను యిలా వివరించారు:

"గండికోట ప్రాజెక్టుకై మనం తీవ్రఆందోళన చేయాలి. ఇన్‌వెస్టిగేషన్ డిపార్టుమెంటు (పరిశోధనశాఖ) పనిని పూర్తిచేయాలని పట్టుపట్టాలి. అంతేగాక బొగ్గేరు, మున్నగు నాగులపై ప్రాజెక్టులు కట్టాలనీ, జమీందారీ ఏరియాలలోఇర్రిగేషన్‌ఆక్టు అమలుజరపాలని తీవ్రఆందోళన చేయాలి. చెరువుల మరమ్మతుకై రైతాంగం ముందడుగు వేస్తేనేగాని, ఏమీలాభం కలుగదు. వ్యవసాయ పనిముట్లూ, ఎరువులూ, విత్తనాలూ యిప్పటికన్నా ఎక్కువగానూ, సక్రమంగానూ సరఫరా అయ్యేటట్లు ఆందోళన చేయాలి.

"ఈ నాడు మన రాష్ట్రంలో, ముఖ్యంగా విశాఖలో, తిండిలేక వేలాదిప్రజలు మరణిస్తున్నారు. అధిక ఆహారపంటలను పండించి ప్రజలను రక్షించుకునే బాధ్యత అన్నదాతలమైన మనపైన ఉంది; ఎక్కువగా పండించడం, పండిన పంటను తిండిదొంగలు కమ్మకుండా ప్రజల కందేలా చేయడం మన విధి."

"కరువు కాటకాలవల్ల స్వతంత్రం రాదు"

"సంవత్సరకాలం నుండీ మనం ముతకధాన్యం బస్తా 1 కి రు 11—0—0 ల రేటు న్యాయమైనదనీ, ఆ ధర రైతుకు ముట్టేటట్లు చేయవలసిన బాధ్యత ప్రభుత్వానిదనీ ఆందోళన చేస్తున్నా, ప్రభుత్వం పెడచెవిని పెడుతోంది. మార్కెటును దొంగవ్యాపారస్తుల చేతిలో వదలిపెట్టింది. 8 వ వంతు ధాన్యాన్ని కొంటానంటూ కూడా ఈ సంవత్సరం ఒక్కగింజైనా కొనకుండా కూర్చుంది. అందువల్ల శ్రావణమాసం నాటికి ఆహారపరిస్థితులు విషమించే ప్రమాద మేర్పడుతోంది. ధాన్యాన్ని దొంగమార్కెటుకు పోకుండాచేసే బాధ్యత, మన ధాన్యాదులకు న్యాయమైన ధరలు రాబట్టుకోవలసిన అవసరం, మనమీద వున్నాయి.

"కరువుకాటకాల నరికట్టడానికి, సక్రమమైన ధరలను రాబట్టుకోవడానికి మనం తీవ్రంగా కృషిచేస్తోంటే, రంగా ప్రభృతులు కరువు కాటకాలద్వారానే స్వాతంత్ర్యం వస్తుందంటున్నారు. మిగులుప్రాంతాలలో కావలసినదానికంటే రెట్టింపు ధాన్యం వుండాలనే వినాదమూ, కరువు ప్రాంతాలలో అవసరమైనదానికంటే రెట్టింపు యివ్వాలనే వినాదమూ, వడ్లధర బస్తా 1 కి రు. 12 లు వుండాలని యిక్కడా, చవుకగా బియ్యం అమ్మాలని అక్కడా వినాదాలిచ్చేవరూ ఉలుకే. కరువు కాటకాలతో ప్రజలు మరణిస్తే స్వాతంత్ర్యం రాదు. బెంగాలులో లక్షలాది ప్రజలు మరణిస్తే విప్లవం రాలేదు. నైతిక సూత్రాలే నాశనమయ్యాయి. కాబట్టి రైతుసోదరులంతా రంగాలాంటి ఊహల (మిగతా 11 వ పేజీ)

విజ్ఞానం - వికాసం

సముద్రపు నీళ్ల నుండిమంచినీళ్లు

★

శాస్త్ర పరిశోధన మన నిత్యజీవితానికి ఎంత ఉపయోగపడుతుందో సోవియట్ దేశం వేనోళ్ళ చాటుతూంది. ఇందుకు అమెరికా నుంచి మరో నిదర్శనం తెలియవచ్చింది. సముద్రపు నీళ్ళను, ఎవరిమట్టుకువారు మంచి నీరుగా మార్చుకోగల సాధనాన్ని కనిపెట్టారు. దీనిని కనిపెట్టిన శాస్త్రజ్ఞుడు అర్యక్ రూజ్ వెల్టుకిబంధువు. సముద్రప్రాంతంలో ఉంటూ మంచినీళ్ళ కరువుతో బాధపడుతున్న ప్రదేశాలెన్నో ఉన్నాయి. ఉదాహరణకు విశాఖపట్నం చూడండి. అక్కడ నీళ్ళ కరువు ఇంతంతకాదు. ముఖ్యంగా వేసవిలో అక్కడ ప్రజలు నీళ్ళకోసం అవురావుడు మంటారు. ఇలాంటి వాళ్లందరికీ ఈసాధనం ప్రాణదాతలాంటి దవుతుంది.

ఏమంత తికమకలుకూడా లేవు ఈసాధనంలో. దీనిపేరు 'సన్‌స్టిల్' 'సన్' అంటే సూర్యుడు. 'స్టిల్' అంటే పరిశుభ్రంచేసే బట్టీ. సూర్యరశ్మితో సముద్రపునీళ్లను పరిశుభ్రంచేసే సాధనం కాబట్టి దీనిని 'సన్‌స్టిల్' అన్నారు. వెల్తుర్ని కొంతవరకు పోనిచ్చే ఒక రసాయనిక పదార్థంతో తయారుచేసిన సీసాలాంటి దుంటుంది. దీని లోపలిభాగంలో ఒక రసాయనిక పదార్థపు పొర ఒకటుంటుంది. 8 కోణాలుగల స్పాంజీలు వలభైయో, యాభైయో ఈపొరకు అమర్చబడివుంటాయి. సముద్రపు నీటిలోనుంచి ఉప్పును పీల్చేసే గుణంగల పదార్థంతో ఈ స్పాంజీలను తయారుచేశారు. కోటు జేబులో పెట్టుకోడానికి తగిన ఒక టిన్ను డబ్బీలో ఉంచుతారు ఈ సీసాను. జాగ్రత్తకోసం. ఎనిమిది గంటల సేపు ఎండలో పెడితేఆ సీసాలోని ఉప్పునీళ్ళు మంచినీళ్లైపోతాయి. అప్పుడప్పుడు ఈసీసాను శుభ్రంగా కడిగేస్తుంటే, స్పాంజీల్లోని ఉప్పంతా పోతుంది; శుభ్రంగా వుంటుంది.

ఈనాడొక చిన్న సీసాగా మాత్రమే తయారుచేశారు. మరికొంచెం పరిశ్రమతో, కుటుంబాలకు సరిపోయే మంచినీళ్ళను తయారు చేసే పాత్రలను కూడా ఉత్పత్తి చేయవచ్చు; ప్రజాసామాన్యానికి దీన్ని అందుబాటులోకి తీసుకురావచ్చు.

-- (U. S O. W. I.)

సత్తెనపల్లి తాలూకా ఇరిగేషన్ రైతుమహాసభ,

క్రోసూరు : మార్చి 14

రైతుసోదరులారా !

మనతాలూకా ఇర్రిగేషన్ రైతుమహాసభ మార్చి 14 వ క్రోసూరులో మధ్యాహ్నం 1గంటనుండిజరుగుతుంది. ఆయకట్టుదారులైన రైతులందరు తమతమ ఇరిగేషన్ సమస్యలతోవచ్చి సభను జయప్రదం చేయ ప్రార్థన.

రాత్రికి 'అహుతి' బెంగాల్‌కరువు, హరికథ చెప్పబడును.

మో. అమేరారెడ్డి,
కార్యదర్శి.

పార్టీఫండు వసూళ్లు

	రు. అ. పై
క్రిందటిసంచికలో ప్రకటించిన మొ॥	8981-4-7

గుంటూరుజిల్లా

శ్రీ మంది పిచ్చయ్య (చీరాల)	1- 0-0
శ్రీ కురాపి సుబ్బయ్య (కారిప)	200- 0-0
,, కోగంటికోటయ్య(దావులూరు)	100- 0-0
,, గొట్టుముక్కల గంటయ్య ,,	66- 0-0
,, మాదినేనివెంకటప్పయ్య ,,	25- 0-0
,, వేము రామసుబ్బయ్య ,,	10- 0-0
,, పొట్టి వెంకటనారాయణ ,,	20- 0-0
,, జొన్నం రామిరెడ్డి ,,	20- 0-0
,, అరిపిరాల నరసింహారావు (తెనాలి)	25- 0-0
,, ఒక అభిమానురాలు ,,	50- 0-0
,, విరాటపు కోటయ్య (అమృతలూరు)	25- 0-0
,, కొత్తపల్లి వెంకటేశ్వర్లు ,,	25- 0-0
,, మంచాల నరసింహారావు (కతెవరం)	10- 0-0
,, అంచారంగారావు కొలకలూరు	25- 0-0
,, కంఠంనేని భూషమ్మ దోనేపూడి	25- 0-0
,, దండా నారాయణస్వామి గోరంట్లపాలెం	75-0-0
,, కె. బ్రహ్మానందరావు ,,	90- 0-0
,, జెటివిల్లి మందయ్య ,,	10- 0-0
,, కనకమేడల వెంకటనారాయణ	100- 0-0
చిల్లరవసూళ్లు	57- 2-6
శ్రీ యం. లక్ష్మీనారాయణ రెడ్డిగారు తన వివాహ సందర్భంలో ఇచ్చినది. (చిత్తూరు)	200- 0-0

కృష్ణా జిల్లా

శ్రీ గుళ్ళపల్లి సుబ్బారావు కురుమద్దాలి	20- 0-0
ముత్తేవి కేశవాచార్యులు ,,	15- 0-0
గుళ్ళపల్లి వెంకటరత్నం ,,	10- 0-0
నందిపాటి పిచ్చిరెడ్డి, పామర్రు	10- 0-0
మల్లిరెడ్డి సత్యం, లింగవరం ,,	40- 0.0
మల్లిరెడ్డి వెంకటనారాయణ ,,	50- 0-0
మల్లిరెడ్డి కోటిరెడ్డి ,,	20- 0-0
మల్లిరెడ్డి రామకృష్ణారెడ్డి, జొన్నపాడు	20- 0-0
గాదిరెడ్డి సుబ్బారెడ్డి ,,	20- 0-0
అడ్డాడగ్రామంనుండి చిల్లరగా	5- 0-0
యిలకుర్రు గ్రామంనుండి చిల్లరగా	5- 0-0
గుడివాడనుండి చిల్లరగా	15- 0-0
అట్లూరి రామారావు, చవుటపల్లి	15- 0-0
కోడూరుగ్రామంనుండి చిల్లరగా	5- 0-0
శ్రీ సూర్యదేవరకుమారస్వామి చింతలపాడు	116- 0-0
వాసిరెడ్డి సూర్యనారాయణ పీరులపాను	10- 0-0
బెజవాడ సుబ్బారెడ్డి, గండేపల్లి	10- 0-0
పీరులపాడునుండి చిల్లరగా	40- 7-0
జగ్గయ్యపేట గ్రామంనుండి చిల్లరగా	12- 0-0
చింతలపాడు గ్రామంనుండి	1-0 -0
దాచవరం గ్రామంనుండి	1-0 -0
వి. ఆర్. మోహన్‌రావు,స్టూడెంటు బెజవాడ	10- 0-0
కంఠంనేని చలపతిరావుగారిద్వారా ఇద్దరు సానుభూతిపరులనుండి	200- 0-0
గన్నవరం తాలూకానుండి ఒక సానుభూతిపరుని ద్వారా	500- 0-0
నెల్లూరుజిల్లా రైతుమహాసభకు బుర్రకథ చెప్పుటద్వారా	50- 0-0

పశ్చిమగోదావరి జిల్లా

నర్సాపురం తాలూకా	224- 0-0
భీమవరం ,,	38-14-9
తణుకు ,,	749- 5-9
కొవ్వూరు ,,	7- 8-0
తాడేపల్లిగూడెం ,,	7- 0-0
చింతలపూడి ,,	17- 3-6
ఏలూరు	59- 3-0
వీరమాచనేని కోటేశ్వరరావు దెందులూరు	50- 0-0
ఏలూరు టౌన్	31- 2-0
కె. దొరారెడ్డి (భీమవరం తాలూకా)	10- 0-0
మొత్తం	10,515-7-7

మంది పిచ్చయ్యది చీరాల. రాష్ట్ర ఆఫీసుకు ఒక రూపాయి పార్టీనిధి పంపుతూ ఒక జాబు రాశాడు. పార్టీపట్ల ప్రేమ, దాని కార్యక్రమంపట్లవిశ్వాసం, ఉట్టిపడేమాటలతో రాసిన ఆ జాబును ఇక్కడ ప్రకటిస్తున్నాము. ఈ యువకుడు చూపుతూన్న ఆదర్శం దేశమంతటా ప్రాకిపోగలదని నమ్ముతున్నాం.

"కామ్రేడ్,

నేను హరిజన విద్యార్థిని. పార్టీఫండు యిద్దామంటే చేతిలో డబ్బులేదు. సమాజములో మా తలలు మేమే గొరుక్కొను ఆచారమున్నదని ప్రతివారికి తెలియును. అందుకని క్షవరముచేసి ఒక రూపాయి (కత్తెరవేసి) సంపాదించితిని. దయతో ఆ రూపాయి తీసికొనుడు.

మంది పిచ్చయ్య"

వివాహకట్నాలు

జనవరి 31 వ తేదీ మలగవేలి (బళ్లారి జిల్లా)లో శ్రీ యం. లక్ష్మీనారాయణరెడ్డి వివాహం జరిగింది. ఈయన మదనపల్లిలో బి. ఎ. చదువుచున్నారు. మదనపల్లి విద్యార్థి కాంగ్రెసు కార్యదర్శి. పార్టీసానుభూతిపరుడు. తన వివాహసందర్భంలో ప్రజాసంస్థలకు యీక్రింది విధంగా విరాళములు యిచ్చారు.

కమ్యూనిస్టుపార్టీ (చిత్తూరుజిల్లా)	200-0-0
ఆంధ్రరాష్ట్ర విద్యార్థిఫెడరేషన్	200-0-0
బళ్ళారిజిల్లా రైతుసంఘం	50-0-0
మహిళాసంఘం	35-0-0
ముస్లింలీగు	25 -0-0
	510-0-0

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ తప్పుడురాతకు జవాబు

ప్రొఫెసర్ ఓగ్నెవ్ రష్యన్ సోవియట్ ఫెడరేటెడ్ సోషలిస్టు రిపబ్లికులో ఒకప్పుడు ప్రధాన సర్జన్. భారతీయుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించడానికై సోవియట్ ఆరోగ్యశాఖామంత్రివర్గం తరపున ప్రతినిధిగా యిటీవల యీయన మనదేశంవచ్చి కొన్ని ప్రధాన నగరాలను దర్శించాడు.

జనవరి 28 వ తేదీని ఆయన మద్రాసు వచ్చి రెండురోజులు అక్కడ ఉన్నాడు. ఈ రెండు రోజుల్లో స్థానికవైద్యశాలలను, వైద్యకళాశాలలను దర్శించి,ఆరోగ్య, వైద్యశాఖాధికారులతో సంప్రదించాడు.

"ఇండియన్ ఎక్స్‌ప్రెస్" విలేఖరి ఆయనను కలుసుకుని మాట్లాడినపుడు, భారతీయుల ఆరోగ్యసమస్య, వైద్యసౌకర్యసమస్య సంతృప్తికరంగానే పరిష్కరించ బడుతున్నాయని ప్రొఫెసర్ ఓగ్నెవ్ అన్నట్లుగా జనవరి 30 వ తేది "ఇండియన్ ఎక్స్‌ప్రెస్"లో ప్రకటించారు.

భారతదేశంలోని పరిస్థితులకు, ఆరోగ్యరక్షణ పద్ధతులకు, సోవియట్ యూనియన్‌లోని పద్ధతులకు యేమైనా తేడా ఉన్నదా? అని ప్రశ్నించగా, యేమీ భేదంలేదని ప్రొఫెసర్ ఓగ్నెవ్ సమాధానమిచ్చినట్లుగూడా ప్రకటితమయింది. వేరువేరుశాఖలను నిర్మాణం చేసే విధానంకూడా రెండు దేశాల్లోనూ దాదాపు ఒకటేననీ, ఈ విషయాల్లో భారతదేశం సక్రమమైనమార్గంలోనే ముందుకు సాగుతూందనీ, ఓగ్నెవ్ అన్నట్లుకూడా "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" ప్రకటించింది. ఈతప్పుడు మాటలను ఆధారంగా తీసుకొని "ఇండియన్‌ఎక్స్‌ప్రెస్" అనాడే ఒక సంపాదకీయంకూడా రాసింది - ఓగ్నెవ్‌ను ఎత్తిపొడిచింది.

సోవియట్ వ్యతిరేక ప్రచారమే పనిగా పెట్టుకున్న "ఇండియన్ ఎక్స్‌ప్రెస్"ఇలాంటి అబద్ధపు వార్తలను ప్రకటించడం సహజమే. ఇలాంటి దుష్ప్రచారం సాగించడం యీపత్రికకిది మొదటిపర్యాయంగాదు. ఇదివరకనేక పర్యాయాలు జరిగింది. ప్రొఫెసర్ ఓగ్నెవ్‌ను గురించి ప్రచురించిన యీవార్తలోని విషయం శుద్ధఅబద్ధం. తానావిధంగా అనలేదని "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" సంపాదకునికి ప్రొఫెసర్ ఉత్తరం వ్రాశాడు. ఈ ఉత్తరం ఫిబ్రవరి 20 వ తేదీ "ఇండియన్ ఎక్స్‌ప్రెస్"లో ప్రకటించబడింది.అతేఅనిచట కర్జుమాచేస్తున్నాం.

ఆర్యా!

30-1-45 వ ప్రకటించబడ్డ "ఇండియన్ ఎక్స్‌ప్రెస్"లోని రిపోర్టు చూచాను. దానిలో కొన్ని ప్రధానమైన తప్పులున్నాయి. భారతీయుల ఆరోగ్యసమస్య, వైద్యసౌకర్యసమస్య సంతృప్తికరంగానే పరిష్కరించబడుతున్నాయనీ, భారతదేశంలోని ఆరోగ్యపరిస్థితులకు, వైద్య సౌకర్యాలకు-సోవియట్‌లోని పరిస్థితులకు తేడా లేదనీ. వేరువేరు ఆరోగ్య, వైద్య శాఖలు ఏర్పాటు చేసేవిధానం, అవి పనిచేసే పద్ధతులు రెండుదేశాల్లోనుదాదాపు ఒకటేననీ, యీ విషయాల్లో భారత దేశం సక్రమ మార్గానే ముందుకు సాగుతున్నదనీ, నేనన్నట్లుగా మీ పత్రికలో ప్రకటించారు. ఇలాంటి మాటలు నేనెప్పుడూ అనలేదు. అలా అనడం అంసంభవం. ఎందువల్లనంటే, సోవియట్ యూనియన్‌లో ప్రజలఆరోగ్యం విషయంలో మనిషి ఒకటికి రూ 30 ప్రభుత్వం ఖర్చుపెడుతూంది. భారత దేశంలో మనిషి ఒకటికి 5 అణాలు మాత్రమే ఖర్చు చేస్తున్నప్పుడు, మీపత్రికలో ప్రకటించిన రీతిగా నేననడం అసంభవం.అది యదార్థానికవిరుద్ధం. అదీగాక నేనుసోవియట్ యూనియనుకు ప్రధాన సర్జన్ అనీ, మాస్కోలో పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంటుకు అధిపతిననీకూడా మీరు ప్రకటించారు. ఇది కూడా అబద్ధమే. నేనిదివరలో రష్యన్ సోవియట్ ఫెడరేటెడ్ సోషలిస్టు రిపబ్లిక్‌కు ప్రధాన సర్జన్‌గా ఉంటూఉండేవాణ్ణి. ఇప్పుడు సోవియట్ ఆరోగ్యశాఖ మంత్రివర్గం తరపున ప్రతినిధిగా భారత దేశానికి వచ్చాను.

—బి. ఓగ్నెవ్.

పోరంబోకలలో జమీందార్లకు ఎట్టి హక్కూ లేదు

— నండూరి ప్రసాదరావు

చల్లపల్లి ఎస్టేటులో సాముదాయిక భూముల తగాదాలను గూర్చి ఇటీవల గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారిచ్చిన స్టేటుమెంటును చూశాను. అందులో వారు "అట్టి భూములు సాముదాయానికి ఉపయోగం లేనప్పుడు కలెక్టరు అనుమతిమీద మార్పుచేసే జమీందారు కధికారమున్నది." అని తెల్పారు. బహూశః సుబ్బయ్యగారు ఎస్టేట్సు లాండుఆక్టు సెక్షన్ 20 (ఎ)ను చదివి వుండరు. ఆ సెక్షను ప్రకారం, సాముదాయిక భూములు వగైరా గ్రామసముదాయం యొక్క అవసరాలకు అవసరం లేనప్పుడు. ఆ భూములపై వున్న రివర్షనరీ హక్కు (ఉత్తరాధికార హక్కు) ప్రకారంరైత్వారీ భూములుగాగాని. జమీందారీ జిరాయతీ భూములుగాగాని. మార్చుటకు అవకాశం వుంది. నాకు తెలిసినంతవరకూ చల్లపల్లి ఎస్టేటులోని ఎస్టేట్సు లాండు ఆక్టు సెక్షను 3 సబ్ క్లాజు 16 (ఎ) (బి) ల క్రిందకువచ్చు ఏ భూములలో కూడా జమీందారుకు రివర్షనరీ హక్కులులేవు. సుబ్బయ్యగారి స్వగ్రామమగు ఘంటసాలకు 2 మైళ్ళ దూరంలోనేవున్న కొత్తపల్లిలో ఇందువిషయమై ఒక దావా జరగటం, ప్రభుత్వానికే రివర్షనరీహక్కు వుందని తీర్పు యివ్వబడటం జరిగింది. బహూశః సుబ్బయ్యగారు దీనిని ఎరిగివుండరు. కాబట్టి మనకున్న హక్కులను మనం వదులుకోరాదు.

చెర్వులు. చెరువు పడకలు. కట్టలు. గ్రామకంఠాలు. రుద్రభూములు. పుంతలు. డొంకలు మొదలయున్న. సూర్పిడి కళ్ళాలు. మొదలైన లఖీరాజ్ భూములు (శిస్తు మాఫీ భూములు) పర్మనెంటు సెటిల్మెంటునాడే ఎస్టేటు దౌలు నుండి మినహాయింప బడ్డాయి చల్లపల్లి ఎస్టేటువారికిచ్చిన సన్నదు 4 వ పేరాలో "........లఖీరాజ్ భూములను.....క్విట్ రెంటు యిచ్చేడి ఈనాంభూములనుమినహాయించి యే పేష్కషును నిర్ణయించడమైనది." అనిన్నీ. మునగాలపర్గణా సన్నదులో "....సర్కారు మహాస్సులు చెల్లించవలసినది లేక వుండే లఖీరాజి నేలలున్నూ. వకరికి యివ్వబడి కొంచెం పన్నును యిస్తూవుండే కదమనేం ఇన్నూ యిందులో చేరినవి కావు." అనిన్నీ స్పష్టీకరింపబడినది. కాబట్టి ఇట్లు పేర్కొనబడ్డ ప్రీ సెటిల్మెంటు పోరంబోకలలో గవర్నమెంటుకే రివర్షనరీ హక్కులుంటాయి. సన్నదులో జమీందారుకుస్పష్టంగాగాని. అస్పష్టంగాగాని. రివర్షనరీహక్కు కల్పించబడితేనే ఆయనకు హక్కు యేర్పడుతుంది. ఇట్టివి చాలా అరుదుగా వున్నాయి. అనేక ఎస్టేట్లలో జమీందార్లు తమకులేని హక్కులను చలాయిస్తూ ఈ పోరంబోకలను అన్యాక్రాంతం చేస్తున్నారు. కాబట్టి జమీన్ రైతు సోదరులందరూ ఈ హక్కును స్పష్టంగా గుర్తించ గోర్తాను.

కృష్ణాజిల్లాలో రైతు మహాసభలు

నందిగామ తాలూకా రైతు మహాసభ
కంచికచర్లలో : మార్చి 8, 9
ప్రారంభకులు : పుచ్చలపల్లి సుందరయ్యగారు
అధ్యక్షులు : నండూరి ప్రసాదరావుగారు

●

గన్నవరం తాలూకా రైతు మహాసభ
తేలప్రోలులో : మార్చి 10, 11
ప్రారంభకులు : రావి నారాయణరెడ్డిగారు
అధ్యక్షులు : నండూరి ప్రసాదరావుగారు

●

కైకలూరు తాలూకా రైతు మహాసభ
చిగురుకోటలో : మార్చి 14, 15
ప్రారంభకులు : కొత్రగడ్డ రాజగోపాలరావుగారు
అధ్యక్షులు : ముక్కామల నాగభూషణంగారు

●

మునగాల పరగణా రైతు మహాసభ
మునగాలలో : మార్చి 12, 13
అధ్యక్షులు : అనుమర్లపూడి సీతారామారావుగారు

●

గుడివాడ తాలూకా రైతు మహాసభ
వెంట్రప్రగడలో : మార్చి 17, 18
ప్రారంభకులు : కొల్లా వెంకయ్యగారు
అధ్యక్షులు : చలసాని వాసుదేవరావుగారు

●

తిరువూరు తాలూకా రైతు మహాసభ
విస్సన్నపేటలో : మార్చి 20, 21
ప్రారంభకులు : చంద్ర రాజేశ్వరరావుగారు
అధ్యక్షులు : రామినేని పిచ్చయ్యగారు

కోఆపరేటివ్ స్టోర్సులోనే దొంగమార్కెటు

●

నర్సారావుపేట కోఆపరేటివు స్టోర్సులో సభ్యులు చాలాకొద్దిమంది ఉండగా ఇప్పటి డైరెక్టర్లు ఎన్నుకోబడ్డారు. అప్పటినుంచి ఆ పెద్దలు సొంతలాభాలకోసం ఏర్పరచబడ్డ వ్యాపారసంస్థగా దీనిని పరిగణిస్తూ వచ్చారు. కొత్తసభ్యులనుచేర్చుకోరు. మేనేజరుచేసే దురంతాలను రిపోర్టుచేస్తే. అధ్యక్ష. కార్యదర్శులు అతన్నే సమర్థిస్తారు. నిన్నండే హాంగా యిప్పుడు జరుగుతున్న దురంతాలన్నీ అధ్యక్ష కార్యదర్శులు మేనేజరుకు మద్దతుగా ఉండి చేయిస్తున్నవే. తమ లక్షిదర్లో రు. 25-7-2 లు వేసుకొని. బండి పట్టాలకు ఒక 1కి రు. 30-0-0లు వసూలు చేశారు. కొండవీటివద్ద రు. 70 లు కూడా తీసుకొన్న ఘటలున్నాయి. వ్యవసాయమూ. బండి. ఎద్దులు లేకపోయినా. పట్టాలు యిస్తున్నారు. వాటిని వారు విపరీతమైన ధరలకు అమ్ముతున్నారు. వీరి పంచదార సవారీరుకు 24 తులాలే తూగేది. అదీ యితర సరుకులు కొంటేగాని అవ్వటానికి దయరాదు. మణుగు 15 రు. 2 లు పొప్పున నిర్ణీత ధరకంటె ఎక్కువ వసూలు చేస్తున్నారు. స్థానిక కో-ఆపరేటివు ఇన్‌స్పెక్టరుగారు. సూపర్‌వైజరుగారు స్టేటుమెంట్లు సేకరించి. అరంతనిముందు పెడితే, అవిగూడా మాయమైనవనివా ర. తనగలు ఒక్కా1కి రు 29-15-8 నిర్ణయించితే. ఈ పెద్దలు రు 35 లకు అమ్ముతున్నారు. ఈ దురాగతాలు అంతరించాలి. స్థానిక రివిన్యూ అధికార్లకు అడునెల్లక్రిందట రిపోర్టిచ్చినా. కదలలేదు.

మరోపర్యాయం ఇనుముకోటా వచ్చింది. ఎవరు పిటీషన్లు యివ్వలేదోయినా. తీసుకొనుట లేదు. తమచిత్తం వచ్చిన వారికి అధిక ధరలకు అమ్మకోటానికి కుతంత్రాలు పన్నుతున్నారు. చుట్టూ గ్రామాలోని రైతులు బహిరంగ సభల్లో తీర్మానాలుచేసి తీవ్రాందోళన చేస్తున్నారు. అధికార్లు ఈఆందోళనను.ప్రజా అసంతృప్తిని గుర్తించి. కొత్తకోటా సక్రమంగా పంపకం జరిగేటట్లు చూడాలి. కో-ఆపరేటివ్‌స్టోర్సును అధికలాభాపేక్షతో దొంగమార్కెటు కేంద్రంగా మార్చిన అధ్యక్షకార్యదర్శులపై తగిన చర్య తీసుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం.

పట్టణ ప్రజలు. ప్రజాసేవకులు స్టోర్సులో చేరి. సహకారపద్ధతికే అప్రతిష్ఠతెస్తున్న వీరిచేతుల్లోనుండి స్టోర్సును గుంజుకోవాలి.

నిరసన సభ

28-2-45 వ తేదీ సాయంకాలం నర్సారావుపేటలో పట్టణకమ్యూనిస్టుపార్టీ యూనియన్ మాన్యశ్రీ చాపలమడుగు రామయ్యచౌదరి బి. ఏ. బి. ఎల్. గారి అధ్యక్షత క్రింద బహిరంగసభ జరిగింది. న్యాయవాదులు. డాక్టర్లు ఇతర విద్యాధికులు, పేదప్రజలు మొత్తం 500 మంది సభకు హాజరయారు. "నెనగలు, పంచదార, బడిపట్టాలు, దొంగమార్కెట్ చేస్తున్న అమ్ముతూ, స్వార్థంకోసం కోఆపరేటివ్‌స్టోర్సును దొంగమార్కెటు కేంద్రంగా మార్చిన స్టోర్సుమేనేజ్‌మెంటు చర్యను ఖండిస్తూ" తీర్మానం ఆమోదింపబడింది. స్టోర్సు మేనేజ్‌మెంటు పోలీసుల చుట్టూ, మేజస్ట్రేటు చుట్టూ144వసెక్షన్ యిప్పించుటకుతిరిగి, ఎలా విఫలులయారో శ్రీ తెలికేపల్లి కృష్ణమూర్తిగారు వివరించారు.

సోంపేట తాలూకాలో స్థానికాధికారుల చర్యలు

సోంపేట తాలూకా (ఉత్తరవిశాఖ) రైతు సంఘ కార్యదర్శి, గానుగుల తరిజాదారిగారు యిలా వ్రాస్తున్నారు :

సోంపేటతాలూకా రైతులకు ప్రభుత్వం వడ్డీలేకుండా ఋణములు యిచ్చినామని ఒక ప్రకటన చేసింది. కాని స్థానికాధికారులు రైతులకు సక్రమంగా ఋణములిచ్చుటలేదు. ఎరువులు, ఇనుపసామగ్రి వగైరా పనిముట్లు, కూడా సక్రమంగా అందితేనేగాని రైతులు వర్షాలుకురియగానే పంటలు పండించలేరు.

ఇంతేగాక. బర్మాకాందిశీకులచేత లేబర్ ఆఫీసరు కూలిపనులు చేయించి. ఎప్పటికప్పుడు వాటికి కూలీడబ్బులు యిచ్చుటలేదు. గంగువాడలో కాందిశీకులచేత 2 మాసముల నుంచి ఏడేసిమైళ్ళదూరం వంటచెరుకు మోయించి, యీమధ్యనే రు. 14 పేమెంట్లు మాత్రం యిచ్చారు. మగవారి కెవరికీ యివ్వవన్నారు. వీరిచేత గ్రామాలలో మందిబావులు, వ్యవసాయానికుపయోగించే చిన్న చిన్న కుంటలు వగైరా తవ్వించినట్లయితే. చాలా ఉపయోగకరంగా ఉండేది. కాని. ఇట్టి పనులేవీ జరగడంలేదు.

ఇక జమీందారీగ్రామాలలో పంటలుపండక పోయినప్పటికీ. జమీందారీ ఉద్యోగులు వచ్చి శిస్తులు చెల్లించవలసిందని గడబిడలు చేస్తున్నారు.

23—2—45 వ తేదీని జిల్లాకలెక్టరు దారున వచ్చినప్పుడు మామిడిపల్లి, రాజాం. మూలసోలం, కాసనాం. పాలవలస. పాతపురం. సిరిమామిడి, రాడిగాం - గ్రామాల రైతులు. కాందిశీకులు పై అక్రమాలను గురించి తెలియజేశారు.

జిల్లా అధికారులు వెంటనే శ్రద్ధవహించాలి. ప్రజల యిబ్బందులను తీర్చాలని ఆశిస్తున్నాము.

కంచు కాగడా

తెణుకు విద్యార్థి సంఘంలో 338 విద్యార్థులున్నారు. చక్కగా పనిచేస్తూ అనేక విజయాలను సాధించింది. 50 రీముల తెల్లకాగితాన్ని దొంగమార్కెటులో పట్టుకొని విద్యార్థులకు యిప్పించింది....

దీనికి పోటీగా కొవ్వలి గోపాలరావుగారు విద్యార్థి కాంగ్రెసును స్థాపించపూనుకున్నారు. విద్యార్థిసంఘ సేవకులు ఉద్యమాన్ని చీల్చడం తగదని వీరికి విన్నవించారు. శ్రీమతి సరోజనీదేవిగారు "పోటీసంఘాలు స్థాపించడం కాంగ్రెసుఆశయం కాదన్నద"ని తెలియజేశారు.

దీనితో కొవ్వలి గోపాలరావుగారికి కోపం వచ్చింది. "సరోజనీదేవి ఎవరు అలా చెప్పడానికి? కాంగ్రెసుకు అసలైన నాయకులు యస్. కె. పటిల్, కాశేశ్వరరావుగార్లు. మాకు పైనుంచి సంఘాలుపెట్టమని వచ్చింది. అంతే - మేం పెట్టితీరుతాము." అని గర్జించారు. ఇంకా మాట్లాడుతూ 'హిట్లరూ, స్టాలినూ ఒకటే. కాంగ్రెసు డిక్టేటరుషిప్పు మాది. కమ్యూనిస్టుపార్టీ డిక్టేటరుషిప్పుమీది." అన్నారు.

ఇంక వీరి విద్యార్థిసేవ చూడండి. హెడ్ మాస్టరుగారికి సలహాయిచ్చి, విద్యార్థిసంఘ సభ్యుల్ని బెదిరించడం. ఈవిధంగా విద్యార్థి సంఘకార్యదర్శిని స్కూలునుంచివెళ్ళగొట్టాలని తలితండ్రులకు చాడీలుచెప్పి, బెదిరించి విద్యార్థుల్ని తమ పోటీసంఘంలో చేర్చుకోవాలని ప్రయాస పడుతున్నారు. కమ్యూనిస్టులను నిందించడం, వేదకాలంనాటి నాగరికత, ఉపనిషత్తులనాటి రాజ్యం కావాలని ప్రచారం చేయడం వీరి రోజువారి కార్యక్రమం.

★

'అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న' అన్నారు. వారెవరోకాదు. ఇన్‌స్యూరెన్సు ఏజెన్సీ ప్రావీణ్య. 'ఉపన్యాసడిండిమ'చెరుకువాడ నరసింహంపంతులుగారు. వీరు తణుకు బహిరంగసభలో చెప్పిన సుభాషితాలు మచ్చుకు కొన్ని చూడండి: "ఎన్ని సంఘాలున్నా పర్వాలేదు. మేం మడిగట్టుక కూర్చుంటే, మీరు ఐక్యత, ఐక్యతఅంటూ ఎందుకు మైలపడ్డాలి?" అని సెలవిచ్చారు. "పృథ్వీసింగ్ డిబ్బుతీసికొని కమ్యూనిస్టుపార్టీ ప్రచారం చేస్తున్నాడు" అనేది యింకో సుభాషితం.

ఇంకా పంతులుగారిలాఅన్నారు. "కమ్యూనిస్టుల మూలసిద్ధాంతాలను 'మార్క్సు, ఎంగిల్సు' వ్రాశారు. ఎంగిల్సు తన పుస్తకంలో వ్యభిచారం చేసినా తప్పులేదు; జూదం ఆడినా తప్పులేదు. దేవుడులేడుఅని వ్రాసినట్లు కాశేశ్వరరావుగారు నాతో చెప్పారు" ఇవన్నీ ఏపుస్తకంలో వున్నవని సభికులు అడిగితే, ఈపెద్ద మనిషి జవాబు చెప్పలేదు. తరువాత యిలా చెప్పారు. "నేను అసెంబ్లీ మీటింగుకు వెళ్ళినప్పుడు యింకో కృష్ణాజిల్లా మిత్రుడు ఇలా చెప్పాడు. కుటుంబంలో కొంతమందిని చీలదీసి కమ్యూనిస్టులు తమ పార్టీలో సభ్యులుగా చేసికొంటున్నారట. ఆస్తులు అమ్మించి, పార్టీ ఫండు తీసికొంటున్నారు. ఆడ, మొగ భేదం లేకుండా లంగర్‌ఖానాలలో భోజనం పెడుతున్నారు." ఇలాంటివే చెణుకులు పంతులుగారి నోటినుంచి యింకా అనేకం వెడలాయి.

ఏంగిల్సు పుస్తకంలో ఏమున్నాయో అది చదివిన మేధావులంతా ఎరుగుదురు. కమ్యూనిస్టుల సిద్ధాంతాలు, ఆచరణ ఎలావుండేదీ విఖ్యాతిపొందిన ప్రముఖుల గ్రంథాలు చదివిన వారందరికీ తెలుసు. అందుచే నేను యీకుళ్ళు నిందలకు ఇచటసమాధానంఇవ్వను. ప్రఖ్యాత క్రైస్తవమత గురువైన డీన్ఆఫ్ కాంటర్‌బరీ వ్రాసిన 'సోషలిస్టు ప్రపంచం', వెబ్బ్ దంపతులు వ్రాసిన 'సోవియట్ కమ్యూనిజం' వంటి పుస్తకాలను చదివితే, పై నిందలు ఎలా శుద్ధఅబద్దాలో బోధపడుతాయి. తెలుగులో కంభంపాటి సత్యనారాయణగారు వ్రాసిన 'నేటి సోవియట్‌యూనియన్' అనే రచనను చదవవచ్చు.

ఇంక వీరు కమ్యూనిస్టుల ఆస్తులు అమ్మడాన్ని నిందించడంలో పదబులేకపోలేదు. ఏమంటే కాంగ్రెసుబాజా వాయించుతూనే, ఇన్‌స్యూరెన్సు ఏజంటుగా శ్రీవారు పొట్టపోసుకున్నారు అంతేగాదు. చాలఆస్తిగడించుకున్నారు. ఇప్పుడు సుఖంగా కాలక్షేపం చేస్తున్నారు. అందుచే వారికి కమ్యూనిస్టులు ఆస్తులమ్మి ప్రజాసేవచేయడం వికృతంగా కన్పించడంలో ఆశ్చర్యంలేదు. డబ్బుకోసం ఇన్సురెన్సు ఏజెన్సీ చేసే సంకుచిత బుద్ధికి పృథ్వీసింగ్ ప్రచారం అలా కన్పించడంలో వింత లేదు. కామెర్లరోగికి ప్రపంచమంతా పచ్చగానే వుంటుందిలెండి!

త్యాగి యితరుల త్యాగాన్ని మెచ్చుకోగలడు. స్వార్థపరునికి అదంతా తెలివి తక్కువగా కన్పించుతుంది. కుటుంబాలను చీల్చుతున్నారనీ, ఆడమొగ భేదం లేకుండా వుంటారనీ, అన్నమాటలు పాటిలేని వాగుడుగా పరిగణించితేచాలు.

నీతి, వ్యక్తిగత ప్రవర్తనల విషయంలో కమ్యూనిస్టు నాయకులు, వర్కర్లు రుజువర్తనులనే విషయం ప్రజలకుతెలుసు. ఏమాత్రం అవలక్షణాలున్నా, పార్టీసహించదు. పంతులుగారు, వారి నాయకులు యీ విషయంలో మానాయకులైన కామ్రేడ్ సుందరయ్యగారివద్ద శుశ్రూషచేసి, పాఠాలు నేర్చుకోవాలంటాను. కమ్యూనిస్టుపార్టీ తనసభ్యులకు చైతన్యం కలిగించుతుంది. శిక్షణయిచ్చి స్వాతంత్ర్య సైనికులుగా తయారుచేస్తోంది. ఎంత త్యాగమైనా చేసి, ప్రజాసేవ చేయగలుగుతున్న కమ్యూనిస్టులను చూసి పంతులుగారి వంటివారు ఆనందించాలి; వారిని దీవించాలి. అంతేగాని, అసూయపడట, నిందించడం ఎందుకు? సిగ్గుచేటుగాదూ!

★

ఇలాంటిదే ఇంకోవిషయం. కమ్యూనిస్టు వ్యతిరేకులు తమ ఉపన్యాసాలలో పూర్వకాలపు నాగరికత కావాలనీ, ఉపనిషత్తుల రాజ్యం కావాలనీ దబ్బావాయించుతున్నారు. పామర్రు సభలో ఉపన్యసించుతూ, కల్లూరి సుబ్బారావుగారూ ఇలాగే వాదించారు. కమ్యూనిస్టులు కోరే సోవియట్ రాజ్యంలో యిహలోక సౌఖ్యాలుమాత్రమే వుంటాయట:పొట్టకు తిండి, కట్టుకోడానికి బట్ట, విశ్రాంతివగైరా సౌఖ్యాలు మాత్రమే వుంటాయట. తాము (అనగా కల్లూరి సుబ్బారావుగారు, కాశేశ్వరరావు పంతులుగారు వగైరా కాటేలు) కోరే ఉపనిషత్తు రాజ్యంలో పరలోక సౌఖ్యాలుకూడ లభించుతాయట! అందుచే ప్రజలు తమను అనుసరించాలట.

20వ శతాబ్దంలో యీ మాటలతో ప్రజలను మోసపుచ్చాలనుకోడం ఎంత హాస్యాస్పదం! ఉపనిషత్తుల కాలంలో పురోహితులు ప్రజలపైన యిల్లాగే పెత్తనం చేసేవారు. పెత్తనం చెలాయించే వర్గాలు తాము సౌఖ్యమనుభవించడానికి కారణం పూర్వజన్మ సుకృతమనేవారు. ప్రజాసామాన్యం కష్టాలనుభవించడానికి కారణం పూర్వజన్మకృత పాపఫలితమనేవారు. పురోహితులు చెప్పినట్లల్లా పాదసేవచేస్తూ పడివుంటే పరలోక సౌఖ్యంఅబ్బుతుందని ఆశచూపేవారు. ఇహలోక సౌఖ్యాలలో మునిగితేలుతూన్న పాలకవర్గాలు. ప్రజలను మోసపుచ్చడానికి వేసినవలయే పరలోక సౌఖ్యమనే ఈమిథ్యావేదాంతం.

కల్లూరి సుబ్బారావుగారివాదనకూడ ఇలాగే వుంది. భారతదేశంలో అధిక సంఖ్యాకులకు కట్టబట్ట, పొట్టకు తిండికూడ సరిగా దొరకడంలేదు. విశ్రాంతి అనేదేమిటో వారు ఎరుగరు. విద్యనభ్యసించే అవకాశమే లేదు. సౌఖ్యాలవిషయం కలలోనివార్త. ఇలాంటి మన ప్రజలకు కావలసింది యేమిటి?

సుబ్బారావుగారు చెప్పే 'పరలోకసౌఖ్యాల'నే మిథ్యావేదాంతంకాదు. సోవియట్ ప్రజాస్వామిక రాజ్యంలో లభించే 'యిహలోక'సౌఖ్యాలవంటివే కావాలి. ఆంధ్రప్రజల కవి గురజాడ అప్పారావు ఏమంటున్నాడో వినండి.

"వెనుకచూసిన కార్యమేమోయి?
మంచిగతమున కొంచెమేనోయి
మందగించక ముందుఅడుగేయి
వెనుకపడితే వెనుకేనోయి."

(8 వ పేజీ తరువాయి) జాతీయ వాదుల నినాదాల నెదుర్కోవాలి. ఐక్య రైతుఉద్యమాన్ని నిర్మించాలి. రైతాంగ సమస్యలను పరిష్కరిస్తూ, కరువుకాటకాల బారినుండి ప్రజానీకాన్ని రక్షిస్తూ ముందుకుసాగాలి. స్వాతంత్ర్యోద్యమాన్ని బలపరచి, నాయకులను విడిపించి, జాతీయైక్యతను సాధించి, స్వాతంత్ర్యాన్ని సంపాదించాలి."

తీర్మానాలు

1. నాయకుల విడుదల, జాతీయ ప్రభుత్వ స్థాపనా కోరుతూనూ. 2. గండికోట ప్రాజెక్టు నిర్మాణాన్ని కోరుతూనూ, 3. ధాన్యం ధర పుట్టి రు. 148 లు ఉండాలని 4. వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు విరివిగా సప్లయి చేయాలనీ. 5 ప్రభుత్వమే ధాన్యాన్ని 8 వ వంతు కొనాలనీ, 6. వెంకటగిరి ఎస్టేటులో కంచెల పుల్లరి తగ్గింది 1932 లో జిల్లా కలెక్టరు మాస్టర్‌మన్ చేసిన రాజీని అమలుపరచాలనీ, 7. దీమూరు ఆస్తి, కులశేఖరపట్నం ఖైదీలపై ఉరిశిక్ష రద్దుచేయాలని, 8. రెడార్మీకి అభినందనాలు అందజేస్తూనూ తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి. ఇవిగాక నేడు జిల్లా రైతుల నెదుర్కొన్న అనేక సమస్యలపై తీర్మానాలు చేయబడ్డాయి.

రాత్రికి 'కష్టజీవి' బుర్రకథ కృష్ణాజిల్లా దళంవారిచే చెప్పబడింది. 8000 మంది ప్రజలు విని ఆనందించారు.

(2 వ పేజీ తరువాయి) నిరసించుతూ, కేంద్రశాసనసభలో రెండు కోత తీర్మానాలు అధికసంఖ్యాకులచే ఆమోదింపబడ్డాయి. కాంగ్రెసు తరఫున, ముస్లింలీగ్ తరఫున అనేకమంది సభ్యులు కార్మికుల కోర్కెలను బలపరుస్తూ ఉపన్యాసాలిచ్చారు.

అయితే, వోట్లబలంతో ప్రభుత్వ విధానాన్ని బట్టబయ లొనర్చగలమేగాని, అధికారాన్ని గుంజుకోలేము. అందుకు శాసనసభకు బయటకూడా కాంగ్రెసు-లీగ్ ఐక్యత వుండాలి. అప్పుడే సర్ ఎడ్వర్డ్ బెంథాల్ ప్రవేశపెట్టు బిల్లులనే కాకుండా, బెంథాల్‌నే ఊడబెరికి జాతీయప్రభుత్వాన్ని ఏర్పరచుకొనగలుగుతాం. —"నీపుల్సువార్"

రెడ్ ఆర్మీ డే

●

"స్టాలిన్‌గ్రాడ్ దగ్గర శత్రువును నిలదొక్కి, రెడార్మీ విజయం సాధించి ఉండకపోతే, మనగతి ఏమయ్యేదో! అనేవిషయం తలచుకుంటే ఈనాటికీ ఒకలాంటి భయం వేస్తుంది"

—బెజవాడ సభలో పాటిబండ్ల సుందరరావు గారు, ఎడ్వోకేటు.

"ఓల్గానదిని తమ నెత్తురుచేరులతో నింపి, మన పవిత్ర గంగానదిని రక్తమయం కాకుండా కాపాడారు రెడార్మీ యోధులు."

—సికింద్రాబాదు సభలో మఖ్దుంగారు.

"ప్రపంచంలో పీడిత ప్రజానీకానికి దాస్యవిముక్తి చేకూరుస్తున్న మహాశక్తి ఎర్రసేన"

—సికింద్రాబాదు సభలో శ్రీ మహాదేవ సింగు గారు.

గతమాసం 23 వ తేదీని ఈ భావాలు దేశంలో అనేక ప్రాంతాల్లో మారుమ్రోగాయి.

సికింద్రాబాదులో అన్ని వర్గాల వారితోను సభాభవనం నిండిపోయింది. ఒక బ్రిటిష్ సైనికుడు కూడా సభలో ఉన్నాడు.

"ఒకప్పుడు రష్యాలోను, ఒకటి రెండు దేశాల్లోను మాత్రమే జరుగుతూఉండినరెడార్మీ దినోత్సవాన్ని ఈనాడు అన్ని దేశాల ప్రజలూ ఎంతోసంతోషంతో జరుపుతున్నారు. రెడార్మీ, దానిపుట్టినిల్లయిన సోవియట్ దేశం ప్రపంచములో ఎంత మహోన్నతమైన స్థానం సంపాదించుకున్నాయో దీనివల్లనేస్పష్టమవుతూంది" అని సభకధ్యక్షతవహించిన శ్రీ మహదేవ్ సింగుగారన్నారు.

రాజమండ్రిలో వివిధ వర్గాలవారు సమావేశమయి వీరరెడార్మీకి, సోవియట్ ప్రజలకు జోహార్లర్పించారు.

కక్షలు, తగాదాలు మానుకొని, దేశాభ్యుదయానికి ప్రజలనందర్నీ సమీకరించవలసిన అవశ్యకతను సోవియటు ఎలాబోధిస్తూందో, నందికొట్కూరు ప్రజలు స్మరించుకున్నారు.

అడుగు పెట్టిన చోటల్లా స్వాతంత్ర్య జ్యోతిని రగుల్చుకుంటూ పోతూన్న రెడార్మీని, దానినికన్న సోవియట్ సమాజాన్ని, చూచి సంతోషించని వారెవరు?

సవరణ

28-2-45 వ తేదీ 'ప్రజాశక్తి'లో 6 వ పేజీ, రెండవకాలం, రెండవ పేరాలో, "రైతులకు న్యాయమైన రు. 10 లు' ముట్టడం లేదు" అని వుంది. ఇదిపొరపాటు. "న్యాయమైన రు. 11 లు....అని" చదువుకోవాలి.

★ యుద్ధసమీక్ష

తాపీ మోహనరావు

క్రైమియా నిర్ణయాలను వ్యతిరేకించే దెవరు?

జర్మన్ పరిశ్రమలకు ముఖ్యాధారం 'రహర్ ప్రదేశం'. దీనికి పడమటి సరిహద్దు రైన్‌నది. ఆ ప్రదేశంలో ముఖ్య పారిశ్రామికకేంద్రం డూసెల్ డార్ఫ్ అనే నగరం. అది ఈనదిమీదనే ఉంది. అమెరికన్ సేనలు ఈ నగరంలో ప్రవేశించాయి. వీధుల్లో సంకులసమరం సాగిస్తున్నాయి. ఇంకొంచం దక్షిణాన రైన్లాండు రాజధాని కోలోన్‌నగరం కూడా ఈ నదిమీదనే ఉంది. మిత్రసేనల ఫిరంగులు ఈ నగరంమీద అగ్నివర్షం కురిపిస్తున్నాయి. పడమటిరంగంలో మిత్రసేనల ఉధృతం రోజురోజుకీ ఇనుమడిస్తూంది.

"ఆ, ఇలా కుప్పిగంతులు వేయడం. మళ్ళీ వెనక్కిరావడం ఎన్నోసార్లు జరిగిందిలే" అని ఇప్పుడు కూడా పెదవి విప్పేవారు ఉండవచ్చు. కాని నేటిపరిస్థితు లేమిటి? తూర్పున జర్మన్ ఆయువుపట్టుల మీదికిరెడార్మీ వచ్చి చేసుకుంటూంది. ఆ ప్రమాదాన్నెదుర్కోడానికి జర్మన్లు పడమటినుంచి సేనలు తూర్పురంగానికి మరలిస్తున్నారు. పడమట జర్మన్ సైనికపంక్తులు మునుపెన్నడూ లేనంత బలహీనంగా ఉన్నాయని లండన్ "టైమ్సుపత్రిక" పారిస్ విలేఖరి రాస్తున్నాడు. మిత్రమండలి సంయుక్త యుద్ధవ్యూహం జర్మన్లను పెద్ద అవస్థలో ఇరికించింది.

తూర్పురంగంలోనే జర్మన్లు సర్వశక్తులను కేంద్రీకరించినట్లయితే పడమటిరంగాన్ని బలహీన పరచుకున్న వారవుతారు. మిత్రసేనలు జర్మన్లను వెన్నంటి తరుముకొస్తాయి. చివరకు సోవియట్ సేనలతో కలిసి చక్రబంధం పూర్తిచేస్తాయి. లేదా ఇదా, అదా ఏదో తేల్చడానికే జర్మన్లు నిశ్చయించుకొన్నట్టయితే మిగిలివున్న కొద్దిసైనికబలం త్వరలో ఖర్చైపోక తప్పదు. ఈ పరిస్థితుల్లో చూచినప్పుడు రైన్‌నదిమీద మిత్రసేనల విజృంభణ క్రైమియా నిర్ణయాలను అమలు జరపడమేనని స్పష్టమవుతుంది. ఇక మిత్రవిమానదళాలు బెర్లిన్‌మీద, ఇతర కేంద్రస్థానాలమీద [illegible] బాంబులు కురిపిస్తూ తమ వంతు కార్యక్రమం కొనసాగిస్తున్నాయి.

మిలిటరీ రంగంలోనేకాదు. రాజకీయ రంగంలో కూడా క్రైమియా నిర్ణయాలు ఆచరణలోకి వస్తున్నాయి. రుమేనియా ప్రధాని జనరల్ రాడెస్కు మరో గ్రీసు నాటకం ఆడబోయాడన్న సంగతి మనమెరిగిందే. ప్రజల వాంఛల్ని కాలరాచి, ఫాసిస్టులతో చేతులు కలుపుతున్నాడని ప్రావ్దా పత్రిక అతన్ని తూర్పారబట్టింది. "రుమేనియా అల్లరులకు కారణం జర్మన్ నాజీలే. వీళ్లు తమ ఏజంట్లను ఇతరదేశాల్లో పంపిస్తున్నారు. మితవాదుల ముసుగు వేసుకున్న రుమేనియా ఫాసిస్టు లిప్పుడే ప్రజాస్వామ్య శక్తులపై కత్తులు నూరుతున్నారు. కాని వాళ్ళ ఆటలు సాగవ"ని సోవియట్ విలేఖరి ఎర్మోషెవ్ రాశాడు. రుమేనియా మరో గ్రీసు కాలేదు. అక్కడ బ్రిటిష్ అధికారులు గ్రీకు సామ్రాజ్యవాదులకు అండగా నిలచి, ప్రజాస్వామ్య శక్తులను అణచివేశారు. కాని ఇక్కడ సోవియట్ అధికారులు ప్రజలకు అండగా నిలచి నిరంకుశుల ఆట కట్టించారు. రాడెస్కు రాజీనామా ఇవ్వవలసివచ్చింది. అతని ఫాసిస్టు ముఠా తోక ముడవక తప్పింది కాదు. "ఫాసిజాన్ని రూపుమాపి, ప్రజలే ప్రజాస్వామ్య సూత్రాలపై తమ స్థితిగతులను నిర్ణయించుకోగల అవకాశాలను కలిగించాలి" అన్న క్రైమియా నిర్ణయాన్ని సోవియట్ ప్రభుత్వం రుమేనియాలో అమలు జరిపింది. నాజీలను ప్రతిఘటించి స్వాతంత్ర్య పోరాటాన్ని నడిపించిన నాయకుల్లో ఒకరిని కొత్తమంత్రివర్గం స్థాపించమని రుమేనియారాజు కోరాడు. ఈవిధంగా రుమేనియా ప్రజలు సోవియట్ అండతో అభ్యుదయ విజయాన్ని సాధించారు.

ఇటలీలో కాలుపెట్టింది మొదలు నేటివరకు అక్కడి రాజకీయాలపై బ్రిటన్ పెత్తనం చెలాయిస్తూ వచ్చింది. చివరకు మంత్రులను నియమించడంకూడా తన ఇష్టాయిష్టాలనుబట్టి సాగాలని శాసించింది. క్రైమియా ఒడంబడిక ఇలాంటి ఆటలను సాగనివ్వడంలేదు. బ్రిటన్ ఈ పెత్తనాన్ని వదులుకోక తప్పింది కాదు. అంతరంగిక విషయాల్లోను, ఇతరదేశాల్లో రాయబారులను నియమించడంలోను ఇక సర్వాధికారం ఇటలీ ప్రభుత్వానిదే అని బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించింది.

ఒకవైపు సత్వర విజయసాధనకు ముందుకు కదిలాయి మిత్రసేనలు. మరోవైపు ప్రజాస్వామ్య శక్తులు అభివృద్ధిపొందే అవకాశాలు కలుగుతున్నాయి. విముక్తి పొందిన దేశాల్లోని ప్రజాప్రభుత్వాలకు సంపూర్ణస్వాతంత్ర్యం చేకూరుతూంది. క్రైమియా సమావేశ సత్ఫలితాలు ఇన్ని రూపాల్లో వెల్లడిఅవుతున్నాయి. ఇలాంటి సమావేశంపై మొన్న కామన్సుసభలో చర్చజరిగింది. ముఖ్యంగా పోలెండు సమస్యపై చర్చవచ్చింది. జారు కాలంనాటి సరిహద్దుకన్నా, రెండు మూడు వందల మైళ్ళు వెనక్కి ఉన్న సరిహద్దును స్టాలిన్ ఈనాడు కోరుతూండనీ, విల్నా స్థానను విడిచిపెట్ట కూడదని ఆనాడు లెనిన్ వాదించినా, ఈనాడది పోలెండుకు చెందడమే న్యాయమని స్టాలిన్, ఇతర సోవియట్ నాయకులు గుర్తించారనీ చర్చిల్ చెప్పాడు. రెడార్మీయే నిలచి యుద్ధంచేయకపోతే, పోలెండు గతి ఏమయ్యేదో ఆలోచించమన్నాడు. బలమయిన, సంపూర్ణ స్వాతంత్ర్యం గల పోలెండును స్థాపించటమే క్రైమియా సమావేశంలో తీసుకొన్న నిర్ణయమని స్పష్టపరిచాడు. ఈ విషయంలో స్టాలిన్ మాటలను పూర్తిగా నమ్ముతున్నానన్నాడు. చర్చిల్ ఉపన్యాసం పూర్తికాగానే లేచాయి కొన్ని దుష్టగ్రహాలు. క్రైమియా సమావేశాన్ని ఖండించడానికి వీళ్ళు విమర్శలలో ముఖ్యకారణాలు:

— ఒక దేశంయొక్క పరోక్షంలో దాని భవిష్యత్తును నిర్ణయించడం బ్రిటిష్ న్యాయబుద్ధికి విరుద్ధం.

—బలప్రయోగంతో సాధించిన కార్యాన్ని అట్లాంటిక్ చార్టరులో అంటగడితే, ఆచార్టరు నిరర్థకమవుతుంది.


— బ్రిటిష్ ప్రతినిధులు క్రైమియా నిర్ణయాన్ని నిరాకరించి వచ్చినట్లయితే, గర్వపడతగిన పని చేసినవార మవుతాం.

— ఈనాడు పోలెండులో ఆర్థికవ్యవస్థ అంతా కమ్యూనిసు సూత్రాలపై నిర్మింపబడుతూంది.

ఈ విధంగా సాగింది క్రైమియా సమావేశంపై విమర్శ. బ్రిటిష్ ప్లానింగ్‌శాఖ యొక్క కార్యదర్శి క్రైమియా సమావేశంపట్ల తన అసమ్మతిని సూచిస్తూ రాజీనామా కూడా ఇచ్చాడు.

నాజీ అభిమానులు

ఇలా విమర్శించినవారి పూర్వవృత్తాంతం కొద్దిగా తెలుసుకుంటేచాలు అసలు గుట్టు బయటపడుతుంది. ఛాంబర్లేన్ విధానాన్ని సమర్థిస్తూ, జర్మన్ నాజీలతోను, ఫ్రాంకోతోను సఖ్యతకోసం ఆందోళన చేసిన ముఠా (యుగోస్లావియాద్రోహి మిహైలోవిచ్‌కి అభిమాని) సౌత్బీ మొదలయిన వీళ్ళంతా ఆనాడు మ్యూనిక్ అఘాయిత్యాన్ని సమర్థించినవాళ్ళే. బ్రిటిష్ ప్రజాసామాన్యానికి కష్ట సుఖం చేకూర్చగల బెవరిడ్జ్‌ప్లానుకు వ్యతిరేకులే. ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పడం, ప్రజలు సుఖపడడం వీరికి గిట్టదు. సోవియటుకి న్యాయం జరగడం వీరికి యిష్టంలేదు. సోవియట్‌వ్యతిరేకవిషవాదాలు రెచ్చగొట్టి, చివరకు సోవియట్‌ని సర్వనాశనం చేయగలమని జర్మన్ నాజీలతో పాటు వీరూ కలలు గంటున్నారు. కామన్సుసభలో జరిగిన వోటింగులో వీరు ఓడిపోయారు. కాని వీరూ, వీరి అస్త్రంయిన పోలెండు సామ్రాజ్యవాదులూ ఆడగల ఆటలు ఇంతటితో ముగిశాయనుకోకూడదు. "శత్రువు యుద్ధనిర్వహణలో నీచాతినీచమయిన ఎత్తుగడలకూడా ఒడిగట్టుతున్నాడు....విజయం చేరువకొస్తున్నకొద్దీ, మేలుకళ్ళతో కనిపెట్టి జాగ్రత్త పడాల"ని స్టాలిన్ హెచ్చరించాడు.



స్టెటిన్‌కి తూర్పుగానున్న నియోస్టెటిన్ అనే ముఖ్యరహదారి కేంద్రాన్ని (స్టెటిన్‌కి డాన్జిగ్‌కి మధ్యనుండి) మార్షల్ రకొసొవ్‌స్కీ సేనలు వశపరచుకున్నాయి. దీన్ని ఆక్రమించుకొని ముందుకు సాగినసేనలు బాల్టిక్ సముద్రతీరాన్ని చేరుకున్నాయి. అంటే-డాన్జిగ్ రంగంలోఉన్న జర్మన్ మూకలకిక తప్పించుకొని పోయేమార్గంకూడా పోయిందన్నమాట. ఇదేసమయంలో, దక్షిణంనుంచి స్టెటిన్ మీదికి వస్తూన్న జుకోవ్ సేనలుకూడా బాల్టిక్‌తీరాన్ని చేరుకున్నాయి. ఈ రెండుసేనలమధ్య చిక్కుకొన్న సేనలగతి వేరే చెప్పనక్కరలేదు.

బెర్లిన్‌కి దక్షిణాన కాట్బస్‌ప్రాంతం మొదలుకొని గార్లిట్జ్ వరకు రెడార్మీ తీవ్రంగా విజృంభిస్తూంది. గార్లిట్జ్‌కి తూర్పుగా 13 మైళ్ళ దూరంలోఉన్న లాబాన్ నగరాన్ని రెడార్మీ ప్రవేశించిందని జర్మన్ల ప్రకటన. గార్లిట్జ్‌ను వశపరచుకొని ముందుకుపోతే డ్రెస్డెన్, లీప్జిగ్ మొదలైన ప్రధాన పరిశ్రమకేంద్రాలు అందుబాటులోకి వస్తాయి. బ్రెస్లో నగరంలో వీధిపోరాటాలు ప్రచండంగా చెలరేగుతున్నాయి. జర్మన్ సేనల్ని హతమార్చుకుంటూ రెడార్మీ ఒకొక్క వీధిని వశపరచుకుంటూంది.

END OF ISSUE